విశాఖపట్టణం
ఆదివారం 26 జూలై 2026

For a pure tomorrow..

జయజయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:183 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## ప్రహ్లాద్ జోషికి
# విద్యాశాఖ అప్పగింత

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**



ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం మరో మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ప్రస్తుతం కన్స్యూమర్ ఎఫైర్స్ శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను ..మిగతా 2లో

# కాక్రోచ్‌ల సక్సెస్



## కేసులు ఎత్తివేతకు ఓకే

### డిమాండ్లన్నీ పరిష్కారానికి సానుకూలత
### దేశవ్యాప్తంగా సీజేపీ ఆందోళన విరమణ

**ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

నీట్-యూజీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో గత కొన్నివారాలుగా దేశ రాజధానిలో సాగుతున్న విద్యార్థుల ఆందోళనలకు ఎట్టకేలకు తెరపడింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన కొద్ది గంటల్లోనే, కాక్‌రోచ్ జనతా పార్టీ తన దేశవ్యాప్త ఉద్యమాన్ని తక్షణమే విరమిస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థుల ప్రధాన డిమాండ్లన్నింటికీ కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. శనివారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్లతో కలసి సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా సంయుక్త విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యమకారులపై కేంద్రం, ఎన్డీయే పాలిత రాష్ట్రాలు నమోదు చేసిన కేసులన్నింటినీ ఎత్తివేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. “నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ప్రతులను సీజేపీ ప్రతినిధులకు ..మిగతా 2లో

## దిగివచ్చిన కేంద్రం

### నెల రోజులుగా జెన్ జీల పోరాటం
### మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
### సెలబ్రిటీల విభిన్న ప్రతిస్పందన



## నన్ను హీరోను చేయొద్దు 2

**అభిజీత్ దీప్కే**



**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో వారాల తరబడి సాగిన నిరసనల అనంతరం, శనివారం నాటి కీలక పరిణామంలో ధర్మేంద్ర ప్రధాన్ తన విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు.. దేశ యువతను ఉద్దేశించి హిందీలో రాసిన సుదీర్ఘ లేఖను ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ట్విట్టర్)లో పంచుకున్నారు. పరీక్షల వివాదంపై ప్రభుత్వం వ్యవహరించిన తీరును సమర్థిస్తూనే, నెలకొన్న పరిస్థితులకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. “తొలి రోజు నుంచే నేను ఈ బాధ్యతను స్వీకరించాను. పరిస్థితి నుంచి ఎప్పుడూ పారిపోలేదు. పరీక్షల మాఫియా కారణంగా ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి భవిష్యత్తు దెబ్బతినకూడదని, ఎవరికీ అన్యాయం జరగకూడదన్నదే ..మిగతా 2లో

# ఏఐ డాక్టర్ వస్తున్నారు..

### వైద్యానికి సాంకేతికత జోడింపు
### ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ డిజిటలైజేషన్
### నేను ఎప్పుడూ సచివాలయానికి పరిమితం కాను
### ప్రజల్లో ఒకడిగా పని చేస్తుంటాను
### సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు
### కర్నూలులో సంజీవనికి శ్రీకారం




**(కర్నూలు - జయజయహే)**

తాను సచివాలయానికే పరిమితం కాకుండా సామాన్యుడిలా ప్రజల మధ్యలోనే ఉంటానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లాలోని ఆస్పరిలో సీఎం చంద్రబాబు పర్యటించి 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లను క్రమం ..మిగతా 2లో

## 31న ముసాయిదా
# ఓటర్ల జాబితా

### 44,71,523 'అన్‌కలెక్టబుల్' ఓటర్లు
### మరణించిన ఓటర్లు 3.65 శాతం
### రాష్ట్రంలో ముగిసిన సర్ ప్రక్రియ



**(అమరావతి - జయజయహే)**

సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియలో కీలక దశ పూర్తయింది. ఈ ప్రక్రియకు సంబంధించి డిజిటలైజేషన్ పనులన్నింటినీ అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తి చేశారు. ఈ సవరణల ఆధారంగా రూపొందించే కొత్త ఓటర్ల జాబితా విడుదలపై ఎన్నికల సంఘం పలు వివరాలను వెల్లడించింది. మొత్తం ఓటర్ల సంఖ్యలో 44,71,523 మందిని 'అన్‌కలెక్టబుల్' ఓటర్లుగా అధికారులు గుర్తించారు. స్థానికంగా అందుబాటులో లేకపోవడం, చిరునామా మారడం లేదా మరణించడం వంటి వివిధ సాంకేతిక, క్షేత్రస్థాయి కారణాలతో వీరిని ఈ జాబితాలో చేర్చారు. రాష్ట్రంలోని ..మిగతా 2లో



# శాఖాపరమైన విచారణ


### టీటీడీ లడ్డూ కల్తీ కేసులో మలుపు
### బాధ్యులైన టీటీడీ ఉద్యోగులపై విచారణ
### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**(అమరావతి - జయజయహే)**

కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవం, తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ మహా పాపంలో కేవలం వ్యాపారులే కాకుండా, ప్రభుత్వ యంత్రాంగంలోని కీలక అధికారులు కూడా భాగస్వాములయ్యారనే దిగ్భ్రాంతికర నిజాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. తిరుమల ..మిగతా 2లో

## 50 శాతం
# గ్రీన్ కవర్ సాధించాలి

### కూటమి ప్రభుత్వ లక్ష్యాన్ని చేరాలి.. డ్రోన్లతో సీడ్ బాల్స్ పంపిణీ
### ఎర్రచందనంపై ఉక్కుపాదం మోపుతాం
### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు
### అటవీశాఖ అధికారులతో కీలక సమీక్ష



**(మంగళగిరి - జయజయహే)**

రాష్ట్రవ్యాప్తంగా సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. సీడ్ బాల్స్ పంపిణీ, వెదజల్లే కార్యక్రమం, డ్రోన్ సాంకేతికత వినియోగంపై అటవీశాఖ ఉన్నతాధికారులతో మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్ సమీక్షించారు. అడవులు క్షీణించిన ప్రాంతాల్లో సీడ్ బాల్స్ జారవిడిచే కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు మరిన్ని డ్రోన్ల సహాయం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అటవీ పునరుద్ధరణ, ..మిగతా 2లో

## విద్యార్థుల ఐక్యతను చూసి
# గర్విస్తున్నాను
## రాహుల్ గాంధీ

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై స్పందించిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత
### ప్రతి విద్యార్థికి, యువకుడికి అభినందనలు తెలిపిన రాహుల్
### ప్రధాన డిమాండ్లు ఇంకా నెరవేరలేదన్న కాంగ్రెస్ అగ్రనేత
### మోదీ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్



2

# కాక్రోచ్‌ల సక్సెస్

మొదటి పేజీ తరువాయి...

నా దృఢ సంకల్పం” అని ప్రధాన్ లేఖలో పేర్కొన్నారు.

**మే 3న అక్రమాలు.. జూన్ 21న తిరిగి పరీక్ష**

2026 మే 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించిన వెంటనే కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించిందని ధర్మేంద్ర ప్రధాన్ గుర్తుచేశారు. ఈ ఉదంతంపై విచారణను వెంటనే సిబిఐ (జదీ×)కి అప్పగించి, పాత పరీక్షను రద్దు చేసి కొత్తగా రీ-టెస్ట్ ప్రకటించిన విషయాన్ని వివరించారు. వచ్చే ఏడాది నుంచి నీట్-యూజీ పరీక్షను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 20 లక్షలకు పైగా అభ్యర్థులకు మళ్లీ పరీక్షను సజావుగా నిర్వహించడమే ప్రభుత్వానికి ప్రధాన ప్రాధాన్యతగా మారింది. జూన్ 21న కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగాలు సమన్వయంతో ‘హోల్-ఆఫ్-గవర్నమెంట్’ విధానంలో రీ-టెస్ట్‌ను విజవంతంగా పూర్తి చేశాయి. జులై 16న వెలువడిన ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, పేదరికంలో ఉన్న అనేకమంది ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా మంచి ప్రతిభ కనబరిచారని లేఖలో ప్రస్తావించారు.

బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న కొందరు వ్యక్తులు ఈ వివాద సమయంలో విద్యార్థులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని, ఆ చర్యలు తనను తీవ్రంగా కలిచివేశాయని ప్రధాన్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించినప్పటికీ, లేఖలో ఎవరి పేర్లను ప్రత్యక్షంగా ప్రస్తావించలేదు. గడిచిన 10 రోజులుగా జరుగుతున్న పరిణామాలు బాధించినప్పటికీ, ఇది తన వ్యక్తిగత గౌరవానికి సంబంధించిన అంశం కాదని స్పష్టం చేశారు. “జంతర్ మంతర్ వద్ద, దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నాను. దేశ వ్యతిరేక శక్తులు దీనిని ఆసరాగా చేసుకోకుండా ఉండేందుకు, దేశ ఐక్యత దెబ్బతినకుండా చూసేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా వారి చదువులపై దృష్టి సారించేలా ప్రధానికి నా



రాజీనామా లేఖను సమర్పించాను” అని తెలిపారు. యువత తప్పుడు సమాచారం, గందరగోళం అనే వలలో పడకూడదని హితవు పలికారు. విద్యా రంగానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ దేశ సేవకే తన మొదటి ప్రాధాన్యమని, పూరీ జగన్నాథుని ఆశీస్సులతో దేశం, తన సొంత రాష్ట్రమైన ఒడిశా ప్రజలు, యువత ఆకాంక్షల కోసం నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు.

**సెలబ్రిటీల రియాక్షన్**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పరిణామంపై దేశ వ్యాప్తంగా ఉన్న సెలబ్రిటీలు రియాక్టవుతున్నారు. సీనియర్ జర్నలిస్ట్ ఫాయ్ డిసౌజా చేసిన ధర్మేంద్ర రాజీనామా పోస్ట్‌కు గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కామెంట్ చేసింది. ‘అప్లాజ్’, ‘సెలబ్రేషన్’, ‘రెడ్ హార్ట్’ ఎమోజీలతో విద్యార్థులకు సపోర్ట్ ప్రకటించింది ఈ వారణాసి హీరోయిన్.

**పవర్ ఆఫ్ ది యూత్**

సింగర్ అర్మాన్ మాలిక్ అని వ్యాఖ్యానించగా, నటుడు ప్రకాష్ రాజ్ “ఒక వ్యవస్థను మోకాళ్లపైకి తెప్పించే శక్తి మీకు ఉందని నిరూపించారు” అంటూ విద్యార్థులను, సోనమ్ వాంగ్‌చుక్‌ను అభినందించాడు. నటుడు విజయ్ వర్మ, నటి తిల్లోత్తమా షోమే కూడా ఈ పరిణామాన్ని విద్యార్థుల విప్లవంగా అభివర్ణించారు.

**రాహుల్ రవీంద్రన్ ఏమన్నాడంటే?**

తెలుగు నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ సోషల్ మీడియాలో పెద్ద పోస్ట్ పెట్టాడు. వ్యవస్థలో ఉన్నత స్థానాల్లో ఉన్నవారు పదే పదే విఫలమైతే పర్యవసానాలు అనుభవించాల్సిందేననే బలమైన సంప్రదాయం నెలకొనాలని అభిప్రాయపడ్డాడు. దేశంలో 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో సరైన వసతులు లేవని, ప్రభుత్వ విద్య కంటే ప్రైవేట్ విద్యకే ప్రజలు ఎక్కువ ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.

శాంతియుతంగా పోరాడిన విద్యార్థులపై ప్రయోగించిన పోలీసుల దాడికి కూడా జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేశాడు.

**నెల రోజుల పోరాటం**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (జజీూ) ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన నిరసన ప్రదర్శనలు దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించాయి. ఈ ఉద్యమానికి మద్దతుగా ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల పాటు సుదీర్ఘ నిరాహార దీక్ష చేపట్టారు. జూలై 20న నిరసనకారులు పార్లమెంట్ వైపు మార్చ్ నిర్వహించగా, పోలీసులు లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడంతో వాతావరణం మరింత వేడెక్కింది. దీంతో స్పందించిన ప్రభుత్వం.. నీట్ కేసులో నిందితులందరినీ అరెస్ట్ చేశామని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ వేగవంతం చేస్తామని ప్రకటించింది. అయినప్పటికీ విద్యార్థుల నిరసనలు తగ్గకపోవడంతో ధర్మేంద్ర ప్రధాన్ స్వయంగా ‘శ’ (ట్విట్టర్) వేదికగా తన రాజీనామా వార్తను పంచుకున్నారు. దేశంలో ఉన్న యువశక్తి భవిష్యత్తు చట్టపరమైన చిక్కుల్లో పడకూడదని, విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలనే ఉద్దేశంతోనే ప్రధానికి రాజీనామా లేఖ పంపినట్లు ఆయన పేర్కొన్నారు.

# 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలి

మొదటి పేజీ తరువాయి...

50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాల్లో సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమం అత్యంత కీలక ప్రక్రియ అని తెలిపారు. ఎల్‌నినో వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియకు ఆటంకం ఉంటుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో మాత్రం జాప్యానికి తావు లేకుండా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కొనసాగించాలి. అవసరం అయితే డ్రోన్ల సంఖ్య పెంచాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో పచ్చదనం తగ్గిన చోట కచ్చితంగా అడవి పునరుద్ధరణ మొదలవ్వాలని స్పష్టం చేశారు. సీడ్ బాల్స్ వెదజల్లిన ప్రాంతాల్లో మొలకలు వస్తే, వాటిని సంరక్షించడం కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్య సాధనలో ఎవరూ అలక్ష్యంగా ఉండవద్దని స్పష్టం చేశారు.

3 కోట్లకు పైగా సీడ్ బాల్స్ సిద్ధం చేయగా, 63 లక్షలకు పైగా సీడ్ బాల్స్ దాదాపు 6,500 హెక్టార్ల విస్తీర్ణంలో వెదజల్లినట్లు అధికారులు తెలిపారు. 6 వేల హెక్టార్ల పరిధిలో 59 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లినట్టు, సుమారు వెయ్యి ఎకరాల్లో డ్రోన్స్ ద్వారా సీడ్ బాల్స్ జారవిడిచినట్లు తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల ఆధారంగా చింతూరు, పీటీ ఆత్మకూరు, గిద్దలూరు, మార్కాపురం, వైఎస్సార్ కడప డివిజన్లలో డ్రోన్ల ద్వారా సీడ్ బాల్స్ జారవిడిచే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్టు వివరించారు. మానవ వనరులు చేరుకోవడం కష్టంగా ఉండే అటవీ ప్రాంతాలను డ్రోన్ ద్వారా చేరుకోవడం సులభం అవుతుందని చెప్పారు.

మరోవైపు రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను నిర్మూలించే లక్ష్యంతో అటవీశాఖ పని చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారుల్ని ఆదేశించారు. డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత వినియోగించుకుంటూ నిఘా పటిష్టం చేయాలని సూచించారు. గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై 506 కేసులు నమోదు చేసి.1239 మందిని అరెస్ట్ చేశామని అధికారులు వివరించారు. నిందితుల నుంచి 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఎర్రచందనాన్ని గుర్తించి ఆయా రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించమన్నారు. 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వివరించారు. గతంలో ఇటువంటి అంతర్రాష్ట్ర ఆపరేషన్లు నిర్వహించలేదన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో 3 శాతం లోపే శిక్షలు పడేవని ఇప్పుడు 95 శాతం కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలు విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

స్మగ్లింగ్ ముఠాల వెనుక ఉన్న కీలక వ్యక్తులు : ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ప్రత్యేకమైన ఎర్రచందనం కాపాడుకోవడం మనందరి బాధ్యతని పవన్ పేర్కొన్నారు. స్మగ్లింగ్ ముఠాల వెనుక ఉన్న కీలక వ్యక్తులు, ఫైనాన్షియర్స్ పైనా దృష్టి సారించాలన్నారు. దేశంలో ఎక్కడ ఎర్రచందనం అక్రమ నిల్వలు ఉన్నా ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని స్వాధీనం చేసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

# ఏఐ డాక్టర్ వస్తున్నారు..

మొదటి పేజీ తరువాయి...

తప్పకుండా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేదరికాన్ని నిర్మూలించడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించిన సీఎం.. వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుంటే ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం ఉండదని హితవు పలికారు. సాంకేతికతను జోడిస్తూ ‘ఏఐ డాక్టర్’ సేవలను అందుబాటులోకి తెచ్చి, ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను డిజిటలైజ్ చేస్తామని వెల్లడించారు. అలాగే భూ హక్కులకు భద్రత కల్పించేందుకు ‘బ్లాక్ చైన్ టెక్నాలజీ’ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆలోచించి పంటలు వేయాలని విజ్ఞప్తి చేస్తూనే, ఆలూరు ప్రాంతంలో తాగునీరు, రోడ్ల సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రాయలసీమ సస్యశ్యామలానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించిన చంద్రబాబు, వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తరలిస్తామని హామీ ఇచ్చారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును, 2028 నాటికి రాయలసీమ స్టీల్ ఫ్యాక్టరీని పూర్తి చేస్తామని స్పష్టమైన గడువు విధించారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని విమర్శిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# నన్ను హీరోను చేయొద్దు:

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

నీట్ పరీక్షల లీకేజీ వివాదం చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసింది. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ఆయన తన పదవికి రాజీనామా చేయగా, ఈ పరిణామంపై ఉద్యమానికి నాయకత్వం వహించిన ‘కాక్రోజ్ జనతా పార్టీ’ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రంగా, భావోద్వేగంగా స్పందించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు తనను హీరోగా కీర్తించవద్దని, ఆ ఘనత తనది కాదని ఆయన స్పష్టం చేశారు.

“ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు నన్ను హీరోను చేయకండి. దయచేసి ఆ తప్పు చేయొద్దు. ఒక వ్యక్తిని హీరోను చేయడం వల్లే ఈ దేశం నాశనమైంది. ఒక వ్యక్తిని రాజ్యాంగం కంటే, వ్యవస్థల కంటే గొప్పవాడిని చేశారు. సమస్య కంటే వ్యక్తిని గొప్పగా చూసినప్పుడు, ఆ వ్యక్తి దేశాన్ని నాశనం చేయక తప్పదు. కాబట్టి ఎవరూ నన్ను హీరోను చేయవద్దు. నినాదాలు చేయాలనుకుంటే ‘భారత్ మాతా కీ జై’, ‘ఇంక్విలాబ్ జిందాబాద్’ అని నినదించండి” అని జంతర్ మంతర్ వద్ద గుమిగూడిన విద్యార్థులను ఉద్దేశించి దీప్కే అన్నారు. ప్రధాని మోదీని ఉద్దేశించి “సుబహ్ హో గయా మామూ” (మామా, తెల్లారింది) అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. “ఇప్పుడు ప్రజాస్వామ్యానికి ఉదయం అయింది. దేశ ప్రజలు మేల్కొన్నారు. నేను చెప్పినట్లే ఇది తొలి వికెట్ మాత్రమే. ఇక్కడితో మేము ఆగబోము. ఇది కేవలం ఆరంభం మాత్రమే,” అని ఆయన హెచ్చరించారు. ఈ విజయం సామాన్యుడిదని, వ్యవస్థ సృష్టించిన మురికి గుంట నుంచి బయటకు వచ్చిన ‘బొద్దింకల’ విజయమని అభివర్ణించారు. ఇది దేశ యువత, భవిష్యత్తు, భారతదేశ కలకు దక్కిన విజయమని పేర్కొన్నారు. ఇక, యువతను కాక్రోచ్ లంటూ వ్యాఖ్యానించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కు ధన్యవాదాలు తెలుపుతున్నామని దీప్కే అన్నారు. ఆయన వల్లే ఇవాళ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సాధ్యమైందని వ్యాఖ్యానించారు. గత 36 రోజులుగా 45 డిగ్రీల ఎండలో, వర్షంలో, పోలీసులు నీళ్లు, ఆహారం నిలిపివేసినా మొక్కవోని దీక్షతో పోరాడిన విద్యార్థులకు, వాలంటీర్లకు దీప్కే సెల్యూట్ చేశారు. ఈ దేశం ఎవరో ఒకరి మనసు ప్రకారం కాదని, రాజ్యాంగం ప్రకారమే నడుస్తుందని విద్యార్థులు నిరూపించారని ప్రశంసించారు. “ఒకప్పుడు జంతర్ మంతర్ వద్ద స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలతో పోరాడాం. ఇప్పుడు నల్లదొరలను తరిమికొట్టాం” అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ పోరాటం ఇంకా ముగియలేదని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. ప్రభుత్వంతో ఇంకా చర్చలు జరగాల్సి ఉందని తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఆమోదం, నీట్ వివాదంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ. 1 కోటి నష్టపరిహారం, ఆందోళనకారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం నుంచి లిఖితపూర్వక హామీ తీసుకుంటామని ప్రకటించారు. విద్యా వ్యవస్థను సమూలంగా మార్చే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఈ ఉద్యమంలో పోలీసు లాఠీ దెబ్బలు తిన్న విద్యార్థులను స్మరించుకుంటూ ఈ సాయంత్రం దేశవ్యాప్తంగా శాంతియుత కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించాలని పిలుపునిచ్చారు.

# 31న ముసాయిదా ఓటర్ల జాబితా

మొదటి పేజీ తరువాయి...

మొత్తం ఓటర్ల సంఖ్యతో పోల్చి చూస్తే.... ఈ అన్‌కలెక్టబుల్ ఓటర్ల శాతం ఏకంగా 10.74 శాతంగా నమోదుగా ఉంది. వీటిలో అత్యధిక వాటా మరణించిన ఓటర్లదే. వీరి సంఖ్య 15,19,558 (3.65శాతం)గా గుర్తించారు. అన్‌కలెక్టబుల్ ఓటర్ల సంఖ్య అత్యధికంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఉన్నట్లు లెక్కలు సూచిస్తున్నాయి. ఆ తర్వాత స్థానాల్లో తిరుపతి, కడప, విశాఖ గుంటూరు ఉన్నాయి. ఇవే కాకుండా మిగిలిన జిల్లాల్లోనూ కొన్ని ఓట్లు తొలగించాల్సిన జాబితాలో ఉన్నాయి. సవరించిన వివరాల ఆధారంగా ఓటర్ల ముసాయిదా జాబితాను ఈ నెల 31వ తేదీన అధికారికంగా విడుదల చేయడానికి ఎన్నికల యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ ముసాయిదా జాబితా వెలువడిన తర్వాత.... అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే దరఖాస్తు చేసుకోవడానికి అభ్యర్థులకు తగిన సమయాన్ని కేటాయిస్తారు. ఆపై క్షేత్రస్థాయి పరిశీలనలు.... వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిష్కరించిన తర్వాత, అక్టోబర్ 3వ తేదీన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది.

ముసాయిదా ఓటర్ల

31.07.2026న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను సమర్పించడానికి 31.07.2026 నుండి 30.08.2026 వరకు సమయం ఉంటుంది. నోటీసుల దశ / క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం: సమర్పించిన అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియను 31.07.2026 నుండి 28.09.2026 వరకు చేపడతారు. అన్ని సవరణలు పూర్తి చేసిన అనంతరం తుది ఓటర్ల జాబితాను 03.10.2026న అధికారికంగా ప్రచురిస్తారు.



# కేసులు ఎత్తివేతకు ఓకే

మొదటి పేజీ తరువాయి...

అందజేస్తాం. విద్యార్థులపై ఎలాంటి ప్రతికూల చట్టపరమైన చర్యలు ఉండవు, అని కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు.

**ఒప్పందంలోని 3 ప్రధాన అంశాలు**

కేంద్ర ప్రభుత్వం, ఎన్డీయే పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు నిరసనకారులపై నమోదు చేసిన అన్ని ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తాయి. భవిష్యత్తులోనూ ఎలాంటి విచారణలు ఉండవు. కుటుంబాలకు పరిహారం: నీట్ పేపర్ లీకేజీ, రీ-టెస్ట్ ఒత్తిడి కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు నిబంధనల ప్రకారం ఇవ్వగలిగే గరిష్ట పరిహారాన్ని అందజేస్తారు. పరీక్షల సంస్కరణలు: పరీక్షల వ్యవస్థలో సంస్కరణల కోసం సీజేపీ సమర్పించిన 5 అంశాల చార్టర్‌పై ప్రభుత్వం తీవ్రంగా ఆలోచించి, వారి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటుంది. “విద్యార్థుల అన్ని ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించింది. సద్భావనతో మా దేశవ్యాప్త ఆందోళనను తక్షణమే విరమిస్తున్నాం” అని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ ప్రకటించారు. నీట్ వివాదం, దానికి తోడు విద్యార్థుల ఆత్మహత్యలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీశాయి. కేంద్రం దిగిరావడం, విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం విద్యార్థుల ఐక్యతకు దక్కిన విజయంగా నిలిచింది.

# శాఖాపరమైన విచారణ

మొదటి పేజీ తరువాయి...

లడ్డు నెయ్యి కల్తీ కేసులో భాగంగా ఫ్యాక్టరీస్, బాయిలర్స్ అధికారులపై శాఖాపరమైన విచారణకు ప్రభుత్వం శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విచారణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా విచారణాధికారిగా ఏపీ బాయిలర్ల డైరెక్టర్ బి ఉమామహేశ్వరరావును నియమించగా, ప్రజెంటింగ్ అధికారిగా జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావును బాధ్యతలు అప్పగించింది. ఈ మొత్తం ప్రక్రియను మూడు నెలల్లోగా పూర్తి చేసి బాధ్యులపై కఠిన చర్యలు సిఫార్సు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన గడువును విధించింది. గత కొద్ది కాలంగా తిరుమల లడ్డు నాణ్యతపై వస్తున్న ఆరోపణలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం, దీనిపై సమగ్ర విచారణ కోసం ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. సిట్ అధికారులు నిర్వహించిన లోతైన దర్యాప్తులో అనేక అక్రమాలు వెలుగు చూశాయి. ముఖ్యంగా నెయ్యి సరఫరా చేసిన శ్రీవైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు లైసెన్స్‌ల జారీ, వాటి రెన్యువల్, ధ్రువపత్రాలు పరిశీలనలో అధికారులు తీవ్రమైన అవినీతికి పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. ఈ క్రమంలో సిట్ చేసిన సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ విచారణకు ఆదేశించింది. గత మే నెలలోనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు అధికారులకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసి, పది రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కోరింది. వారు సమర్పించిన లిఖిత పూర్వక సమాధానాలు సంతృప్తికరంగా లేకపోవడంతో ఇప్పుడు పూర్తి స్థాయి శాఖాపరమైన విచారణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

**దొరికిన డైరీ కీలకం**

ఈ కేసులో అత్యంత కీలకమైన సాక్ష్యం శ్రీవైష్ణవి డెయిరీలో దొరికిన డైరీ. సిట్ అధికారులు జరిపిన సోదాల్లో ఈ డైరీ లభ్యమైంది. ఈ డైరీలో ఫ్యాక్టరీస్ బాయిలర్స్ విభాగంలోని అధికారులకు ఎప్పుడెప్పుడు ఎంతెంత లంచాలు ఇచ్చారో, నెలవారీ మామూళ్లు ఎవరెవికి అందాయో వివరంగా నమోదు చేశారు. లైసెన్స్ జారీలో నిబంధనలను తుంగలోతొక్కడానికి కల్తీ నెయ్యి తయారీ కేంద్రాలపై తనిఖీలు చేయకుండా ఉండటానికి ఈ అధికారులు భారీ మొత్తంలో లంచాలు తీసుకున్నట్టు ఆరోపణలు బలంగా ఉన్నాయి. డైరీలో ఉన్న వివరాలు ఆధారంగా అధికారులు ఎవరెవరు ఈ అవినీతి కూపంలో ఉన్నారో సిట్ గుర్తించింది.

# విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నాను

రాహుల్ గాంధీ

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. దేశంలో విద్యా వ్యవస్థను తిరిగి సరైన మార్గంలో పెట్టేందుకు ఈ పరిణామం ఒక పెద్ద అడుగు అని అభివర్ణించారు. వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు పోరాడిన ప్రతి విద్యార్థికి, యువకుడికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని సోషల్ మీడియా వేదికగా సందేశాన్ని విడుదల చేశారు. విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నానని రాహుల్ వ్యాఖ్యానించారు. మంత్రి పదవి నుంచి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకొన్నప్పటికీ, తమ ప్రధాన డిమాండ్లు ఇంకా నెరవేరలేదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులు, దేశ భవిష్యత్తును గౌరవిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన హింసకు, లాఠీఛార్జిలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే రెండు ముఖ్యమైన డిమాండ్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. బాధ్యులైన ప్రతీ ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాల్సిందేనని ఉద్ఘాటించారు. ఈ ప్రభుత్వం చేతిలో అణచివేతకు గురైన రైతులు, కూలీలు, పేదలు, ఇతర వర్గాల ప్రజలందరూ తమ ఆత్మగౌరవం కోసం రాజ్యాంగబద్ధంగా నిలబడాల్సిన సమయం వచ్చిందని రాహుల్ పిలుపునిచ్చారు. అణచివేతకు భయపడకుండా ధైర్యంగా నిలబడటంలోనే అసలైన నిరసన బలం ఉందన్నారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించిన రాహుల్ గాంధీ, “ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు” అని పేర్కొన్నారు.

# ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అప్పగింత

మొదటి పేజీ తరువాయి...

కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు. కర్ణాటకలోని ధార్వాడ్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రహ్లాద్ జోషి.. ఆహార, ప్రజాసరఫరా వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖ వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తున్నారు. భారత్ చొరవతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌కు ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

# ప్రతిష్టాత్మకంగా.. గిరి ప్రదక్షిణ



**- సమష్టి కృషితో పకడ్బందీ ఏర్పాట్లు**

**- భక్తుల రద్దీని తగ్గించేందుకు పలు చోట్ల నమూనా ఆలయాలు**

**- 4మండలాల్లో 221విద్యాలయాలకు సెలవు**

**- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత**

**విశాఖపట్నం, జూలై 25, జయ జయ హే**

ఈ నెల 28, 29వ తేదీల్లో జరగనున్న సింహాచలం గిరి ప్రదక్షిణను ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. 32 కిలోమీటర్ల మేర జరిగే గిరి ప్రదక్షిణ మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రతి చోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవి పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలని, అన్ని కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి మార్గంలో ఏం జరుగుతుందో నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం కొండపై దర్శనాలకు వచ్చే భక్తుల సంఖ్యను అంచనా వేసి తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. భక్తులకు అనువైన ప్రాంతాల్లో నమూనా ఆలయాలను ఏర్పాటు చేసి అక్కడ భద్రతా చర్యలు చేపట్టాలని, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. తొలి పావంచాతో పాటు నమూనా ఆలయాల వద్ద కూడా కొబ్బరికాయలు కొట్టి భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించుకునేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ తదితర అంశాల్లో తగిన చర్యలు తీసుకోవాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**ట్రాఫిక్ నిర్వహణలో ముందుచూపు: కలెక్టర్ అభిషిక్త్ కిశోర్**

గిరి ప్రదక్షిణ సందర్భంగా సాధారణ ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. నాలుగు ప్రవేశ మార్గాల వద్ద తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు చేసి, వచ్చే బస్సులు, తిరిగి వెళ్లే బస్సులు ఎక్కడ నిలపాలనే విషయాన్ని సూచించేలా స్పష్టమైన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ మళ్లింపులపై ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలన్నారు. గోపాలపట్నం, చినగదిలి, సీతమ్మధార, పెందుర్తి మండలాల పరిధిలో గిరి ప్రదక్షిణ మార్గానికి సమీపంలోని 221 పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. సమీక్షలో ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, దేవస్థానం ఈవో వెంకటరావు, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

# లోకేష్‌కి నైతిక బాధ్యత లేదా...!

**డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి**

**విద్యా మంత్రి లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి**

**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ అధ్యక్షులు కేకే రాజు డిమాండ్**

**విశాఖపట్నం, జూలై 25, జయ జయహే :**

జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు దేశవ్యాప్తంగా ఎంతటి సంచలనానికి దారితీశాయో, అదే స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ--2026 నియామక ప్రక్రియలో కూడా తీవ్ర అవకతవకలు, అక్రమాలు, అవినీతి జరిగాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కెకె రాజు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటమాడిందని, లక్షలాది మంది అభ్యర్థుల నమ్మకాన్ని వమ్ము చేసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. జాతీయ స్థాయిలో నీట్ పరీక్షలపై వచ్చిన ఆరోపణలను దేశ ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకించారని, దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయని ఆయన గుర్తు చేశారు. ఆ ఘటనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని, నైతిక బాధ్యతను స్వీకరిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డీఎస్సీ-2026 పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల, ఎంపికల ప్రక్రియలో అనేక సందేహాలు, అభ్యంతరాలు, అక్రమాల ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని కెకె రాజు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది అభ్యర్థులు ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగాల కోసం కష్టపడి సిద్ధమై పరీక్షలు రాశారని, అయితే వారి ఆశలను ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. డీఎస్సీ నియామకాలలో మెరిట్ జాబితాలో మార్పులు చేశారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అర్హత, ప్రతిభ ఆధారంగా ఎంపికలు జరగాల్సిన చోట రాజకీయ ప్రభావం, డబ్బు లావాదేవీలు, అధికార దుర్వినియోగం చోటుచేసుకున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ ఆరోపణలు రాష్ట్ర ప్రజల్లో, ముఖ్యంగా నిరుద్యోగ యువతలో తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయని అన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణ నుంచి ఫలితాల విడుదల వరకు జరిగిన ప్రతి అంశాన్ని నిష్పాక్షికంగా విచారించాలని, మెరిట్ జాబితా తయారీ, ఎంపికల ప్రక్రియ, స్పోర్ట్స్ కోటా అమలు, నియామకాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలని కోరారు. డీఎస్సీ అక్రమాలపై వస్తున్న ఆరోపణలకు నైతిక బాధ్యత



వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కెకె రాజు డిమాండ్ చేశారు. నీట్ వ్యవహారంలో కేంద్ర మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసినప్పుడు, రాష్ట్రంలో అంతకంటే తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యాశాఖ మంత్రి అదే ప్రమాణాన్ని ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. ప్రజలు ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది ప్రజాసేవ కోసం, పారదర్శక పాలన కోసం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి తప్ప వారి జీవితాలతో చెలగాటమాడేందుకు కాదని ఆయన అన్నారు. నిరుద్యోగ యువత కష్టాన్ని, వారి కుటుంబాల ఆశలను ప్రభుత్వం గౌరవించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీఎస్సీ అక్రమాలపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే డీఎస్సీ బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం ఈ డిమాండ్లను పట్టించుకోకుండా కాలయాపన చేస్తే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగ యువత ప్రజాస్వామ్యబద్ధంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# చాకిపల్లి వద్ద పెద్దేరు నదిపై వంతెన నిర్మాణానికి చర్యలు

**క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అధికారులు**

**చోడవరం జనసేన ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు**

**చోడవరం జూలై 25 జయ జయహే**

దశాబ్దాల కాలం నుండి చోడవరం నియోజకవర్గంలో గల చోడవరం మండలం చాకిపల్లి వద్ద పెద్దేరు నదిపై వంతెన నిర్మాణానికి కదలికలు వచ్చాయి. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో వంతెన నిర్మాణానికి అవసరమని చర్యలు చేపట్టేందుకు అధికారులు శనివారం పరిశీలన జరిపారు. ఈ నదిపై బ్రిడ్జి లేక వ్యవసాయ పనులు చేసుకునే రైతులు,వ్యవసాయ కూలీలు పనులు నిమిత్తము ప్రతిరోజు ప్రమాదకరమైన ఈ నదిని ఒక తీగ సహాయంతో దాటుతూ ఉండడం జరుగుతూ వస్తుంది. ఈ క్రమంలో కొంతమంది ప్రాణాలు కోల్పోవడం కూడా జరిగింది. ఈ అతిపెద్ద సమస్యను జనసేన పార్టీ ప్రతిపక్షంలో ఉండగానే చోడవరం జనసేన పార్టీ మేనిఫెస్టో అయిన “లక్ష్యం” లో పొందుపరిచి కూటమి ప్రభుత్వం రాగానే ఈ సమస్యను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తామని ప్రజలకు మాటివ్వడం జరిగింది.ఈ నదిపై నిర్మించబోయే ఈ వంతెన వల్ల కన్నంపాలెం, రామజోగిపాలెం,చాకిపల్లి ,భోగాపురం తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులకు వ్యవసాయ శ్రామికులకు ప్రాణభీతి లేకుండా సౌకర్యంతమైన వ్యవసాయ పలు చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ప్రజల ఆకాంక్షలు, నియోజకవర్గం జనసేన పార్టీ అభ్యర్థనపై ఈ వంతెన ఆవశ్యకతను గుర్తించి దీని నిర్మాణానికి అవసరమయిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయమని ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి నుండి నుండి అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయని పార్టీ ఇంచార్జి రాజు అన్నారుఈ సందర్భంగా గ్రామ ప్రజలు పార్టీ నాయకులతో కలిసి రాజు తీగ వంతెన ప్రాంతాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.రాజు గ్రామస్తులతో మాట్లాడుతూ ఇక్కడ వంతెన నిర్మించడం అనేది ప్రజల



చిరకాల స్వప్నం కావడం వలన తాము దీనిని అత్యంత ప్రాముఖ్యత అంశంగా తీసుకున్నామని, తనను తొలిసారి ఈ వంతెన నిర్మాణం కోసం ప్రజలు కోరిన సందర్భంలో ఇక్కడ పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నప్పుడు ఆరోజు నదిని దాటుతూ వస్తున్న శ్రీమతి కోయిలాపల్లి సోములమ్మ తన ఆవేదనను వ్యక్తం చేస్తూ తాను భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నాను అని, ప్రతిరోజు తెల్లవారుజామున చీకట్లో ఈ నదిని దాటుతూ రోజుకు నాలుగు సార్లు అటు ఇటు వెళ్లి వస్తున్నానని చెప్పినప్పుడు తనకు అత్యంత వేదన కలిగిందని అన్నారు. అలాగే ఆ రోజు ఒక పెద్దాయన మాట్లాడుతూ దశాబ్దాలు తరబడి ఈ నదిని రోజూ దాటుతూ వ్యవసాయ పనులు చేసుకోవడం తమ జీవితాల్లో ఎంతో అభద్రతను ఎన్నో కష్టాల్ని మిగిల్చిందని, గతంలో కొంతమంది ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారని చెప్పినప్పుడు ఎలాగైనా ఈ వంతెన నిర్మాణం చేయాలని గట్టిగా నిర్ణయించుకొన్నామని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ విషయాన్ని శ్రీ పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్ళినప్పుడు అయన సానుకూలంగా స్పందించి అవసరమయిన ఆదేశాలను జారీ చేసారన్నారు.కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తూ ఉండడంతో పాటు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో పవన్ కళ్యాణ్ గారు ఒక విలక్షణమైన రాజకీయ నాయకుడిగా ఇలాంటి సమస్యలను పరిష్కరించడం వలన తమ జీవితాల్లో వెలుగులు వస్తాయని వారికి రుణపడి



ఉంటామని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు .స్థానిక జనసేన పార్టీ నాయకులు, యువత మాట్లాడుతు ఎన్నోసార్లు దీనిపై ఎన్నో ప్రయత్నాలు చేశామని, ఈరోజు తమ కల నెరవేరుత్తున్నందుకు పవన్ కళ్యాణ్ గారికి రుణపడి ఉంటామని అన్నారు. ఈ వంతెన నిర్మాణం వలన చదువులకోసం చోడవరం వెళ్ళడానికి ప్రస్తుతం ఉన్న 10 కిలోమీటర్లు దూరం 5 కిలోమీటర్లకు తగ్గుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో చోడవరం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అల్లం మాధవి రామ అప్పారావు, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు నందవరపు రమాదేవి నాయుడు, పార్టీ నాయకులు జెర్రిపోతుల నానాజీ, నరవ సరోజిని, చప్పగడ్డ శ్రీను, తుమ్మపాల దేముళ్ళు నాయుడు, సియ్యాద్రి జగదీశ్, మిస్కా భూలోక నాయుడు, దేవర అప్పల నాయుడు, కోసం నర్సింగ్ , చింతల కిషోర్, స్థానిక నాయకులు యలమంచిలి శ్రీనివాస్, నేమని సింహాచలం, పోతల అప్పారావు,నందికొల్ల గణేష్ ,పోలేపల్లి శ్రీను,లగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు



## స్వయం ఉపాధికి పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రండి

**జిల్లా ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి త్రివేణి**

**మాడుగుల జూలై 25 జయ జయహే**

స్వయం ఉపాధి సాధించేందుకు పదిమందికి ఉపాధి కల్పించేందుకు నిరుద్యోగ యువత ముందుకు వచ్చే పరిశ్రమలు స్థాపించాలని తద్వారా ప్రభుత్వాన్ని ఇచ్చే ప్రోత్సాహాన్ని అందుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ ప్రమోషన్ అధికారి ఎస్ త్రివేణి విజ్ఞప్తి చేశారు. శనివారం మోడల్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల మాడుగుల లో జరిగిన ఒక నెల ఒక నియోజకవర్గం కార్యక్రమంలో మాడుగుల మండల బిజెపి ప్రధాన కార్యదర్శి మండల సత్యజిత్ రాయ్ మాడుగుల ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని తద్వారా యువతకు ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్ శనివారం పరిశ్రమల శాఖ అధికారులను పంపించి తగు అవకాశాలను పరిశీలించమన్నారు. దీంతో స్థానిక యువతతో సమావేశం అయ్యారు. ఎండి ఓకే అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎం ఎస్ ఎం ఎ పార్క్ ఏర్పాటుకు కావలసిన ప్రభుత్వ స్థలంతో పాటు నీటి వనరులు, కావలసిన వనరులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రాంతంలో లభించే వనరులు ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చని ఆమె యువతకు సూచించారు. ఎందుకు ప్రభుత్వం కూడా ఏర్పాటు చేయబోయే పరిశ్రమను బట్టి సబ్సిడీ అందజేస్తాదని తెలిపారు. ప్రైవేట్ భాగస్వామ్యంలో కూడా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. అలాగే వ్యక్తిగతంగా కూడా చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. మహిళలకు అయితే 45% సబ్సిడీ కూడా ప్రభుత్వం అందిస్తాదన్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంలో పార్కు ఏర్పాటు చేయాలంటే కావలసిన భూమితో పాటు చుట్టూ ప్రహరి రహదారి సౌకర్యం నీటి సౌకర్యం వంటివి కల్పిస్తే ఎకరాకు ఐదు లక్షలు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని చెప్పారు. అలాగే ప్రభుత్వ పరంగా ఎంఎస్ఎమ్ఈ పార్క్ ఏర్పాటు చేయాలంటే తగిన ప్రభుత్వ భూమి ఉండాలని అందుకు సంబంధించిన సర్వే నెంబర్లు ఇతర వివరాలు ఏమైనా ఉంటే తమకు అందజేయాలని వాటిని కలెక్టర్కు నివేదిస్తామని ఆమె తెలిపారు. కాబట్టి యువత ముందుకు వచ్చి ఈ ప్రాంత అభివృద్ధిలో భాగంగా పార్కులు ఏర్పాటులో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ రాజారాం, కూటమి నాయకులు పి లక్ష్మీనారాయణ, మండల సతీష్, మెల్లిపాక స్వామి,రొబ్బా మహేష్, పి నాగేంద్ర, మాజీ ఉపసర్పంచ్ ఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## అధికారం శాశ్వతం కాదు కక్షపూరిత రాజకీయాలు తగవు

**మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి**

**టెక్కలి జూలై 25 జయ జయహే**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగంతో కక్షపూరిత రాజకీయాలు చేయడం తగదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే వైయస్సార్సీపి క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి అన్నారు. టెక్కలి వైఎస్ఆర్సీపి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ ను ఆమె పరామర్శించి సంఘీభావం తెలిపారు.రాష్ట్ర మాజీ మంత్రి సీదరి అప్పలరాజును పలాసలో సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన తిలక్ ను అక్రమ కేసును పెట్టి పోలీసులు అరెస్టు చేసి మెలియాపుట్టి పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయ చర్యలేనని ఆమె విమర్శించారు. భవిష్యత్తులో తెదేపా నాయకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రెడ్డి శాంతి అన్నారు, ఈ కార్యక్రమంలో టెక్కలి, పాతపట్నం వైఎస్ఆర్సీపి ప్రతినిధులు శ్రేణులు పాల్గొన్నారు.

## మాడుగులలో ముగిసిన జగన్నాథ రథోత్సవాలు

**హాజరైన ఎమ్మెల్యే**

**మాడుగుల జులై 25 జయ జయహే**



మాడుగులలో నిర్వహిస్తున్న శ్రీ జగన్నాథ స్వామి వారి రథోత్సవాలు శనివారం సాయంత్రం తో ముగిసాయి. ఈనెల 16వ తేదీన ఈ ఉత్సవాలను ప్రారంభించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని గవరవీధిలో గల ఇంద్ర ధ్యోమనం లో కొలువుంచారు. తొలి రోజున స్థానిక ఎమ్మెల్యే బండర సత్యనారాయణమూర్తి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పదిరోజులపాటు దశావతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. చివరి రోజు తొలి ఏకాదశి పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ప్రతియతను అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం యధా ప్రకారం సుభద్ర బలబద్రుని సహిత శ్రీ జగన్నాథ స్వామివారిని రథంలో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయానికి చేర్చారు. స్థానిక ఎమ్మెల్యే బందర్ సత్యనారాయణమూర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ శ్రీవారి సేవకులు ఈ కార్యక్రమంలో సేవలు అందించారు. ఉత్సవాలు సహకరించిన దాతలకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

# చాతుర్మాసం ప్రాముఖ్యత

(సి.హెచ్.ప్రతాప్)

హిందూ ధార్మిక సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన కాలాల్లో చాతుర్మాసం ఒకటి. ఆషాఢ శుక్ల ఏకాదశి రోజున ప్రారంభమై కార్తీక శుక్ల ఏకాదశి వరకు కొనసాగే ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాసం అంటారు. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి ప్రవేశిస్తాడని పురాణాలు పేర్కొంటాయి. అందుకే ఈ కాలాన్ని భక్తి, నియమం, ఆత్మశుద్ధి, ధర్మాచరణకు అనువైన సమయంగా భావిస్తారు. భారతీయ సంస్కృతిలో శరీరానికి విశ్రాంతి ఎంత అవసరమో, మనస్సుకు ఆధ్యాత్మిక విశ్రాంతి కూడా అంతే అవసరమనే సందేశాన్ని చాతుర్మాసం అందిస్తుంది.

చాతుర్మాసం కేవలం మతపరమైన ఆచారం మాత్రమే కాదు; జీవనశైలిని క్రమబద్ధం చేసే ఆధ్యాత్మిక సాధన కూడా. ఈ కాలంలో సన్యాసులు, యతులు ఒకేచోట నివసిస్తూ ప్రజలకు ధర్మబోధ చేస్తారు. దేశమంతా సంచరించే వారు వర్షాకాలంలో ప్రయాణాలను విరమించి ఒక ప్రాంతంలోనే ఉండటం వల్ల ప్రకృతి సంరక్షణతో పాటు ప్రజలకు సత్సంగాలు, పురాణ ప్రవచనాలు, వేదాంత బోధనలు అందే అవకాశం కలుగుతుంది. సమాజంలో నైతిక విలువలు పెంపొందించడంలో ఈ సంప్రదాయం విశేష పాత్ర పోషించింది.

వర్షాకాలం ప్రారంభమయ్యే ఈ నాలుగు నెలల్లో ఆరోగ్యపరంగా కూడా ప్రత్యేక జాగ్రత్తలు అవసరమని ఆయుర్వేదం సూచిస్తుంది. జీర్ణశక్తి కొంత మందగించే ఈ సమయంలో ఉపవాసం, మితాహారం, సాత్వికాహారం పాటించడం వల్ల శరీరానికి మేలు జరుగుతుంది. అందుకే చాతుర్మాసంలో చాలామంది ఒక ఆహార పదార్థాన్ని లేదా కొన్ని అలవాట్లను త్యజిస్తూ నియమం పాటిస్తారు. కొందరు ఉల్లిపాయ, వెల్లుల్లి వంటి పదార్థాలను వదిలివేస్తే, మరికొందరు తీపి పదార్థాలు, వేయించిన ఆహారాన్ని మానేస్తారు. ఈ నియమాలు కేవలం ఆచారాలుగా కాకుండా ఆరోగ్య పరిరక్షణకు కూడా తోడ్పడతాయి.

చాతుర్మాసంలో శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవి, శివుడు, గణపతి, దుర్గాదేవి తదితర దేవతల ఆరాధనకు విశేష ప్రాధాన్యం ఉంది. ఈ కాలంలో గురుపౌర్ణిమ, నాగపంచమి, వరలక్ష్మీ వ్రతం, శ్రీకృష్ణ జన్మాష్టమి, వినాయక చవితి, మహాలయ పక్షం, శరన్నవరాత్రులు, దీపావళి వంటి ఎన్నో పవిత్ర పర్వదినాలు వస్తాయి. ప్రతి పండుగ భక్తిని మాత్రమే కాకుండా కుటుంబ ఐక్యతను, సంస్కృతిని, సామాజిక సౌహార్దాన్ని కూడా బలపరుస్తుంది. దేవాలయాల్లో జరిగే ప్రత్యేక పూజలు, పారాయణాలు, అన్నదాన కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తాయి.

చాతుర్మాసం మనిషికి ఆత్మపరిశీలనకు కూడా మంచి అవకాశం కల్పిస్తుంది. ప్రతిరోజూ కొంత సమయం ధ్యానం, జపం, భగవద్గీత లేదా పురాణాల పఠనానికి కేటాయించడం ద్వారా మనసుకు ప్రశాంతత లభిస్తుంది. కోపం, అసూయ, ద్వేషం, అహంకారం వంటి దుర్గుణాలను తగ్గించి దయ, క్షమ, వినయం, సేవాభావం వంటి సద్గుణాలను పెంపొందించుకోవాలని ఈ కాలం బోధిస్తుంది. భౌతిక విజయాల కోసం పరుగులు తీసే ఆధునిక జీవితంలో ఇలాంటి ఆధ్యాత్మిక విరామం వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగపడుతుంది.

ప్రస్తుతం వేగవంతమైన జీవనశైలిలో ఆధ్యాత్మిక విలువలకు సమయం కేటాయించడం తగ్గిపోతోంది. అలాంటి పరిస్థితుల్లో చాతుర్మాసం మన జీవనానికి సమతుల్యతను తీసుకువచ్చే అవకాశాన్ని అందిస్తుంది. కుటుంబ సభ్యులు కలిసి ప్రార్థనలు చేయడం, పిల్లలకు ధార్మిక కథలు చెప్పడం, వృక్షారోపణ, గోసేవ, అన్నదానం, పేదలకు సహాయం వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఈ కాలం మరింత సార్థకమవుతుంది. పర్యావరణ పరిరక్షణ, జీవరాశుల పట్ల కరుణ, మితవ్యయం వంటి విలువలు కూడా చాతుర్మాస ఆచరణలో అంతర్లీనంగా ఉన్నాయి.

చాతుర్మాసం సారాంశం భక్తి మాత్రమే కాదు, వ్యక్తిగత క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, ప్రకృతి పట్ల గౌరవం, ఆత్మవికాసం కూడా. ఈ నాలుగు నెలలను సద్వినియోగం చేసుకొని సత్కార్యాలు, సద్భావనలు, సత్ప్రవర్తనతో జీవిస్తే వ్యక్తిగతంగా శాంతి, కుటుంబంలో సౌభ్రాతృత్వం, సమాజంలో సౌహార్దం మరింత బలపడతాయి. అందుకే చాతుర్మాసం భారతీయ సంస్కృతిలో శాశ్వతమైన ఆధ్యాత్మిక సంపదగా నిలిచింది.

# ఇంద్రజిత్ (మేఘనాదుడు)-అంధ విధేయత వల్ల తప్పుదారి పట్టిన ప్రతిభ




### పరిచయం

**రావణుని కుమారుడైన ఇంద్రజిత్, లేదా మేఘనాదుడు, రామాయణంలోని అత్యంత శక్తివంతమైన, ప్రతిభావంతమైన యోధులలో ఒకడు. పరాక్రమం, మేధస్సు, అస్త్రశస్త్ర విద్య, తపస్సు, యుద్ధ వ్యూహరచన---ఈ అన్ని రంగాలలో అతడు అసాధారణ ప్రతిభను కనబరిచాడు. దేవేంద్రుడిని జయించి "ఇంద్రజిత్" అనే బిరుదును సంపాదించిన మహావీరుడిగా అతడు చరిత్రలో నిలిచాడు. అయినప్పటికీ, అతని జీవితం ఒక గొప్ప నైతిక సత్యాన్ని మన ముందుంచుతుంది--- ప్రతిభకు ధర్మం అనే దిశ లేకపోతే, అది చివరకు వినాశనానికే దారి తీస్తుంది.**

### అసామాన్య ప్రతిభకు ప్రతీక

ఇంద్రజిత్ కేవలం యుద్ధవీరుడు మాత్రమే కాదు; లోతైన తపస్సు చేసిన సాధకుడు, అస్త్రవిద్యలో ప్రావీణ్యం కలిగిన మహాయోధుడు. బ్రహ్మాస్త్రం వంటి దివ్యాయుధాలను వినియోగించే సామర్థ్యం అతనికి ఉండేది. యుద్ధ వ్యూహాలను రూపొందించడంలో, శత్రువులను ఆశ్చర్యపరిచే మాయాయుద్ధాలను నిర్వహించడంలో అతని నైపుణ్యం అపూర్వమైనది.

దేవేంద్రుడిని ఓడించి "ఇంద్రజిత్" అనే బిరుదును పొందడం అతని వీరత్వానికి పరాకాష్ట. ఈ విజయాలు అతని శక్తిని ప్రపంచానికి చాటాయి. అయితే ప్రతిభ ఎంత గొప్పదైనా, దానికి సరైన నైతిక దిశ లేకపోతే అది శాశ్వత విజయాన్ని అందించదని అతని జీవితం నిరూపిస్తుంది.

### అంధ విధేయత -- పతనానికి మూలకారణం

ఇంద్రజిత్ తన తండ్రి రావణుని పట్ల అపారమైన గౌరవం, ప్రేమ, విధేయత కలిగి ఉన్నాడు. కుటుంబ విధేయత ఒక గొప్ప గుణమే. అయితే ఆ విధేయత ధర్మవివేచనను కోల్పోయినప్పుడు అది ప్రమాదకరంగా మారుతుంది.

రావణుడు సీతను అపహరించడం ధర్మవిరుద్ధమని తెలిసినా, ఇంద్రజిత్ తండ్రిని ప్రశ్నించలేదు. సత్యాన్ని సమర్థించకుండా, తండ్రి నిర్ణయాన్నే ధర్మంగా భావించాడు. ఈ అంధ విధేయత కారణంగానే అతని మేధస్సు మరియు శక్తి అధర్మానికి సేవ చేశాయి.

రామాయణం మనకు చెప్పే గొప్ప పాఠం ఏమిటంటే--- విధేయత గొప్ప గుణమే; కానీ అది ధర్మానికి లోబడి ఉండాలి.

### ప్రతిభకు నైతిక దిశ అవసరం

ఇంద్రజిత్ తన ప్రతిభను ధర్మరక్షణ కోసం కాకుండా, అన్యాయాన్ని కాపాడటానికి వినియోగించాడు. అతని మేధస్సు, యుద్ధనైపుణ్యం, ఆధ్యాత్మిక శక్తి అన్నీ ఒక తప్పు లక్ష్యానికి సేవ చేయడంతో అతని జీవితం విషాదాంతమైంది.

జ్ఞానం, శక్తి, ప్రతిభ స్వతహాగా మంచివి లేదా చెడ్డవి కావు. వాటి విలువ వాటిని ఏ లక్ష్యానికి ఉపయోగిస్తున్నామనే దానిపై ఆధారపడి ఉంటుంది. ధర్మం లేకుండా ఉన్న ప్రతిభ సమాజానికి మేలు చేయలేకపోతుంది.

### ఆధునిక జీవితానికి సందేశం

ఇంద్రజిత్ కథ నేటి ప్రపంచానికి అత్యంత ప్రాసంగికమైనది. విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, కృత్రిమ మేధస్సు, వైద్యం, రాజకీయాలు, పరిపాలన---ప్రతి రంగంలోనూ అసాధారణ ప్రతిభ కలిగిన వ్యక్తులు ఉన్నారు.

అయితే ఆ ప్రతిభను మానవ సంక్షేమం కోసం ఉపయోగిస్తే అది అభివృద్ధికి దోహదపడుతుంది; స్వార్థం, అధికారం, లేదా విధ్వంసం కోసం ఉపయోగిస్తే అదే ప్రతిభ ప్రమాదకరంగా మారుతుంది. అణుశక్తి విద్యుత్తును ఉత్పత్తి చేయగలదు; అదే అణుశక్తి వినాశకర ఆయుధంగా కూడా మారగలదు. కృత్రిమ మేధస్సు విద్యను అభివృద్ధి చేయగలదు; అదే సాంకేతికత దుర్వినియోగానికి కూడా గురికావచ్చు. అందుకే ప్రతిభకు నైతిక దిశ అత్యవసరం .

### కర్తవ్యానికి మరియు ధర్మానికి మధ్య సమతుల్యత

ఇంద్రజిత్ జీవితంలోని మరో ముఖ్యమైన సందేశం కర్తవ్యానికి మరియు నైతికతకు మధ్య సమతుల్యత అవసరమనే విషయం. కుటుంబం పట్ల ప్రేమ, గౌరవం, విధేయత అవసరమే. కానీ అవి న్యాయం, సత్యం, ధర్మం కంటే పై స్థాయికి చేరకూడదు.

నిజమైన విధేయత అంటే తప్పును సమర్థించడం కాదు; అవసరమైతే ధర్మాన్ని కాపాడటానికి ధైర్యంగా నిలబడటం. ఈ విలువ ప్రతి కుటుంబ సభ్యునికి, ఉద్యోగికి, నాయకుడికి, పౌరునికి సమానంగా వర్తిస్తుంది.

### ఇంద్రజిత్ మరణం -- ఒక తాత్విక సందేశం

లక్ష్మణునితో జరిగిన తుదియుద్ధంలో ఇంద్రజిత్ తన సమస్త శక్తిని ప్రదర్శించాడు. మాయాయుద్ధాలు, దివ్యాస్త్రాలు, అపూర్వమైన యుద్ధ నైపుణ్యం---అన్నింటినీ వినియోగించాడు. అయినప్పటికీ, ధర్మబలాన్ని అధర్మం జయించలేకపోయింది.

అతని మరణం ఒక వ్యక్తి ఓటమి మాత్రమే కాదు; అధర్మానికి సేవ చేసిన ప్రతిభ యొక్క పరాజయం . ధర్మం చివరికి విజయం సాధిస్తుందనే రామాయణ సందేశానికి ఇంద్రజిత్ జీవితం ఒక శక్తివంతమైన ఉదాహరణ.

### ఆధునిక నాయకత్వానికి పాఠాలు

ఇంద్రజిత్ పాత్ర నుండి నాయకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిపాలకులు, యువత నేర్చుకోవలసిన పాఠాలు ఎన్నో ఉన్నాయి.

ప్రతిభకు నైతిక విలువలు తోడవాలి.

విధేయత వివేకంతో కూడి ఉండాలి.

కుటుంబం లేదా సంస్థ పట్ల నిబద్ధత ధర్మాన్ని అతిక్రమించకూడదు.

శక్తి సమాజ సంక్షేమానికి ఉపయోగపడాలి.

సత్యం ముందు వ్యక్తిగత బంధాలు కూడా పరీక్షకు లోనవుతాయి.


### ముగింపు

ఇంద్రజిత్ అసాధారణ మేధస్సు, అపూర్వ వీరత్వం, అచంచల విధేయతకు ప్రతీక. అయితే అతని జీవితం మనకు ఒక శాశ్వత సత్యాన్ని తెలియజేస్తుంది---ధర్మం లేని ప్రతిభ చివరకు తనకే శత్రువుగా మారుతుంది.

నేటి ప్రపంచంలో విద్య, విజ్ఞానం, సాంకేతికత, రాజకీయాలు, వ్యాపారం---ప్రతి రంగంలోనూ ఈ సందేశం అత్యంత ప్రాసంగికమైనది. ప్రతిభను నైతిక విలువలతో, బాధ్యతతో, మానవతా దృక్పథంతో వినియోగించినప్పుడే అది నిజమైన విజయాన్ని సాధిస్తుంది.

" ప్రతిభ మనిషిని శక్తివంతుణ్ని చేస్తుంది; కానీ ధర్మమే ఆ శక్తికి సరైన దిశను చూపిస్తుంది. ధర్మం లేని మేధస్సు చివరకు తననే ఓడించుకుంటుంది. "

అందుకే ఇంద్రజిత్ కథ ఆధునిక సమాజానికి ఒక శాశ్వత మార్గదర్శకం--- ప్రతిభకు దిశా నిర్దేశం నైతికతే; విధేయతకు వివేకం తోడైతేనే అది మహోన్నత గుణంగా మారుతుంది.



ప్రొఫెసర్
విశ్వేశ్వర రావు
చెనమల్లు

# నీట్... నమ్మకానికి పరీక్ష

**పేపర్ లీక్‌లు, పరీక్షలపై వివాదాలు...
ప్రశ్నార్థకమవుతున్న విద్యార్థుల భవిష్యత్తు**

**వ్యవస్థలపై నమ్మకాన్ని కలిగించడం
ప్రభుత్వాల ముందున్న అతిపెద్ద బాధ్యత**



ప్రశ్నాపత్రం లీక్‌కు పునఃపరీక్ష ప్రత్యామ్నాయం కావచ్చు. కానీ పరీక్షా వ్యవస్థలపై దెబ్బతిన్న విశ్వాసానికి అలాంటి ప్రత్యామ్నాయం లేదు. ఆ నష్టం ఒక విద్యార్థిదే కాదు... ఒక తరం భవిష్యత్తుదే.

ఒక దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుంది. ఆ భవిష్యత్తుకు ద్వారంగా నిలిచేది పరీక్షా వ్యవస్థ. ప్రతిభను గుర్తించి సమాన అవకాశాలు కల్పించడమే పరీక్షల అసలు లక్ష్యం. కానీ పరీక్షల నిర్వహణపై సందేహాలు తలెత్తిన ప్రతిసారీ ప్రశ్నార్థకమయ్యేది కేవలం ఒక పరీక్ష కాదు... మొత్తం విద్యా వ్యవస్థ విశ్వసనీయత.

ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు వైద్య విద్యలో ప్రవేశం కోసం నీట్ పరీక్ష రాస్తున్నారు. ఆ పరీక్ష వెనుక కేవలం కొన్ని గంటల పరీక్షా సమయం మాత్రమే ఉండదు. ఎన్నో సంవత్సరాల కృషి, కుటుంబాల త్యాగం, ఆర్థిక భారం, భవిష్యత్తుపై ఆశలు దాగి ఉంటాయి. అలాంటి పరీక్షలపై పేపర్ లీక్‌లు, అక్రమాల ఆరోపణలు వినిపించిన ప్రతిసారీ విద్యార్థుల మనసులో ఒక్క ప్రశ్నే మెదులుతోంది – మా కష్టానికి నిజంగా విలువ ఉంటుందా?"లి

### పేపర్ లీక్ కాదు... వ్యవస్థలపై నమ్మకం పోతుంది

ప్రశ్నాపత్రం లీక్ కావడం కేవలం ఒక నేరం మాత్రమే కాదు. అది నిజాయితీగా శ్రమించిన లక్షలాది మంది విద్యార్థుల నమ్మకంపై దెబ్బ. సమాన అవకాశాలపై విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య. ప్రతిభను గుర్తించే పరీక్షా వ్యవస్థపై సమాజంలో సందేహాలను పెంచే పరిణామం.

ఒక పరీక్షను మళ్లీ నిర్వహించడం సాధ్యమే కావచ్చు. కానీ పరీక్షా వ్యవస్థపై దెబ్బతిన్న విశ్వాసాన్ని తిరిగి నిలబెట్టడం అంత సులభం కాదు.

ఇటీవలి కాలంలో నీట్‌తో పాటు పలు ప్రభుత్వ నియామక పరీక్షలు, ప్రవేశ పరీక్షలపై కూడా వివిధ ఆరోపణలు, వివాదాలు చోటుచేసుకున్నాయి. ప్రతి ఘటనకు సంబంధించిన వాస్తవాలు దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియల ద్వారా తేలాల్సిందే. అయితే అలాంటి ఘటనలు విద్యార్థుల్లో కలిగించే ఆందోళన, అనిశ్చితి మాత్రం వెంటనే తొలగిపోవు.

అందుకే పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత, జవాబుదారీతనం మరింత బలోపేతం కావాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. పరీక్ష అనేది కేవలం మార్కులు కేటాయించే ప్రక్రియ కాదు. అది ప్రతిభకు సమాన అవకాశాలు కల్పించే వ్యవస్థ. ఆ వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రులు, సమాజం ఉంచిన విశ్వాసాన్ని కాపాడడం ఏ ప్రభుత్వానికైనా, ప్రతి పరీక్షా సంస్థకైనా అత్యంత కీలకమైన బాధ్యత.

### ఒక సీటు వెనుక... ఒక కుటుంబం కల ఉంటుంది

నీట్ లాంటి పరీక్షలో ర్యాంకు సాధించడం ఒక విద్యార్థి వ్యక్తిగత విజయం మాత్రమే కాదు. అది ఒక కుటుంబం చేసిన త్యాగానికి ప్రతిఫలం. అనేక కుటుంబాలు అప్పులు చేసి కోచింగ్ ఇప్పిస్తాయి. కొందరు తమ అవసరాలను తగ్గించుకుని పిల్లల చదువుకు ప్రాధాన్యం ఇస్తారు. గ్రామాల నుంచి పట్టణాలకు మారి విద్య కోసం కొత్త జీవితాన్ని ప్రారంభించే కుటుంబాలు కూడా ఉన్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో పరీక్షల విశ్వసనీయతపై సందేహాలు తలెత్తితే దెబ్బతినేది కేవలం విద్యార్థి కాదు... ఒక కుటుంబం ఆశ, విశ్వాసం కూడా.

### పోటీ పెరుగుతోంది... ఒత్తిడి కూడా

నేటి యువత తీవ్రమైన పోటీని ఎదుర్కొంటోంది. పరిమిత సీట్లు, పెరుగుతున్న కోచింగ్ సంస్కృతి, ఆర్థిక ఒత్తిడి, కుటుంబాల అంచనాలు – ఇవన్నీ కలిసి విద్యార్థులపై భారాన్ని పెంచుతున్నాయి. దీనికి తోడు పరీక్షలపై వివాదాలు చోటుచేసుకుంటే ఆందోళన మరింత తీవ్రమవుతుంది.

"ఎంత చదివినా ప్రయోజనం ఏమిటి?" అనే నిరాశ పెరగడం ఏ సమాజానికైనా మంచి సంకేతం కాదు. పరీక్షల్లో విజయం ఎంత ముఖ్యమో, విద్యార్థుల్లో నమ్మకాన్ని నిలబెట్టడం కూడా అంతే ముఖ్యం.

### రాజకీయాలకు అతీతమైన అంశం

పేపర్ లీక్ లేదా పరీక్షలపై వివాదాలు వచ్చినప్పుడు రాజకీయ చర్చలు జరగడం ప్రజాస్వామ్యంలో సహజం. అధికార, ప్రతిపక్షాలు తమ వాదనలు వినిపిస్తాయి. అయితే ఆ చర్చల మధ్య అసలు బాధితుడైన విద్యార్థి మరుగున పడకూడదు.

విద్యార్థికి రాజకీయ విజయం అవసరం లేదు. తన కష్టానికి న్యాయం జరిగే వ్యవస్థ కావాలి. పరీక్షలు నిష్పాక్షికంగా జరుగుతాయనే విశ్వాసం కావాలి.

### వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయం

ప్రతి ఘటన తర్వాత దర్యాప్తులు, అరెస్టులు, ప్రకటనలు చేయడం అవసరమే. కానీ సమస్య పదేపదే పునరావృతమవుతుంటే వ్యవస్థాపరమైన సంస్కరణల అవసరం స్పష్టమవుతోంది.

### చేయాల్సినవి:

సాంకేతిక భద్రత: ప్రశ్నాపత్రాల భద్రతలో అత్యాధునిక సాంకేతికత, డిజిటల్ ట్రాకింగ్ వినియోగం

పర్యవేక్షణ: పరీక్షా కేంద్రాల పర్యవేక్షణ, స్వతంత్ర ఆడిట్

జవాబుదారీతనం: అక్రమాలకు పాల్పడే ముఠాలపై వేగవంతమైన చర్యలు

మానసిక మద్దతు: పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొనే విద్యార్థులకు కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య సహాయ సేవల విస్తరణ

### విద్యార్థి విశ్వాసమే దేశ సంపద

దేశ అభివృద్ధికి మౌలిక వనరు సహజ వనరులు మాత్రమే కాదు... ప్రతిభావంతమైన యువత కూడా. ఆ ప్రతిభను వెలికితీయాల్సిన పరీక్షా వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటే దాని ప్రభావం ఒక్క తరం మీదే కాదు, దేశ అభివృద్ధిపైనా పడుతుంది.

అందుకే పరీక్షలను నిర్వహించడం మాత్రమే కాదు, వాటిపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడం కూడా ప్రభుత్వాలు, పరీక్షా సంస్థలు, సమాజం కలిసి నిర్వర్తించాల్సిన బాధ్యత.

పరీక్షల్లో గెలుపు, ఓటములు సహజం. కానీ పరీక్షా వ్యవస్థపై విశ్వాసం కోల్పోవడం మాత్రం ఏ దేశానికైనా ప్రమాదకరం.

పరీక్షా హాల్లో కూర్చున్న ప్రతి విద్యార్థి ఒక ర్యాంకు కోసం మాత్రమే పోరాడటం లేదు. తన కల కోసం, తన కుటుంబం కోసం, తన భవిష్యత్తు కోసం పోరాడుతున్నాడు. ఆ పోరాటానికి న్యాయం జరిగేలా చూడటం మనందరి బాధ్యత.

పేపర్ లీక్‌లను అరికట్టడం పరిపాలనా చర్య మాత్రమే కాదు... అది ఒక తరం ఆశలను, దేశ భవిష్యత్తును కాపాడే జాతీయ కర్తవ్యం.



పరీక్షలో మార్కులు కోల్పోతే ఒక విద్యార్థి నష్టపోతాడు. కానీ పరీక్షా వ్యవస్థపై నమ్మకం కోల్పోతే నష్టపోయేది దేశ భవిష్యత్తే.

జి. అజయ్ కుమార్

# జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు కంబాల చేయూత..

## రాజమండ్రి ప్రెస్ క్లబ్‌కు రూ.1.50 లక్షల విరాళం

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూలై 25:**



జర్నలిస్టుల సంక్షేమం, ఆరోగ్య భద్రతకు అండగా నిలుస్తూ రామసేన వ్యవస్థాపకులు, బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు రాజమండ్రి ప్రెస్ క్లబ్‌కు రూ.1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. శనివారం ప్రెస్ క్లబ్‌ను సందర్శించిన ఆయన, సభ్యుల హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం కోసం చెక్కును ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోత బాల విజయసారథి, జనరల్ సెక్రటరీ వేణుగోపాల స్వామి (గోపి)కు అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో జరిగే ప్రతి అంశాన్ని ప్రజలకు నిష్పక్షపాతంగా చేరవేసే బాధ్యత జర్నలిస్టులదేనని కొనియాడారు. రాత్రింబవళ్లు ప్రజాసేవలో నిమగ్నమై ఉండే విలేకరులకు ఆరోగ్య భద్రత అత్యంత అవసరమని, ఆ బాధ్యతలో భాగంగానే హెల్త్ ఇన్సూరెన్స్ కోసం తన వంతు సహకారంగా రూ.1.50 లక్షల విరాళాన్ని అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా రాజమండ్రి ప్రెస్ క్లబ్ అభివృద్ధికి అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ భవనంపై మరో అంతస్తు నిర్మాణం, ఆధునిక జిమ్ ఏర్పాటు, సభ్యులకు మరిన్ని సౌకర్యాల కల్పన వంటి అభివృద్ధి కార్యక్రమాలకు తన పూర్తి సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్పొరేట్ స్థాయిలో రాజమండ్రి ప్రెస్ క్లబ్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోత బాల విజయసారథి, జనరల్ సెక్రటరీ వేణుగోపాల స్వామి (గోపి) మాట్లాడుతూ ప్రతి సభ్యునికి రూ.15 లక్షల విలువైన హెల్త్ ఇన్సూరెన్స్ అందించే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు అందించిన రూ.1.50 లక్షల విరాళం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంపై ఆయన చూపిన చొరవ అభినందనీయమని పేర్కొంటూ ప్రెస్ క్లబ్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి శ్రీపాద పురుషోత్తం కుమార్, ఉపాధ్యక్షుడు గంగాధర్, సంయుక్త కార్యదర్శులు కృపానందం, ప్రసాద్, సభ్యులు పాలపర్తి శ్రీనివాస్, ఈశ్వర్, కొట్టే మధు, సత్యనారాయణ,సిసిసి గోపాలకృష్ణ, చంటితో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కంబాల శ్రీనివాసరావును ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా శాలువా కప్పి సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు.



## పరిశోధనలు అంతర్జాతీయ గుర్తింపును ఇస్తాయి

### విజ్ఞాన వికాసానికి పరిశోధనలు అవసరం

**టెక్కలి జూలై 25 జయ జయహే**

విద్యాసంస్థల్లో పరిశోధన పరమైన ప్రచురణలు అధ్యయనాలు, పత్రాలు, ప్రచురణలు అంతర్జాతీయ స్థాయి గుర్తింపును తీసుకువస్తాయని ఐతం కళాశాల డైరెక్టర్ వి వి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కళాశాలలో పరిశోధన పుస్తకానికి జాతీయ బ్రోచర్ ఆయన ఆవిష్కరణను చేశారు, నెక్స్ట్ జనరేషన్ బిగ్ డేటా ఎనాలటిక్స్ ఏ ఐ ఇంటిగ్రేషన్ అండ్ రియల్ వరల్డ్ అప్లికేషన్స్ పేరుతో రూపొందించిన అంతర్జాతీయ పరిశోధనా పుస్తకానికి బ్రోచర్ను విడుదల చేశారు. అంతర్జాతీయ వేదికల్లో ఇటువంటి పుస్తకాలు పరిచయం కావడం వల్ల విజ్ఞాన వికాసానికి ఎంతగానో తోడ్పాటునిస్తాయని పేర్కొన్నారు, పుస్తక సంపాదకులు డాక్టర్ కె స్వరూప మాట్లాడుతూ పుస్తకం ఉద్దేశాలు అధ్యాయనాల ఆహ్వానం రచన సమర్పణ విధానం సమీక్ష ప్రక్రియ ప్రచురణ ప్రమాణాలు రచయితలకు కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ ఎస్ శ్రీనివాసరావు , ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ భట్టాచార్య ,డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ టి నరేష్, అధ్యాపకులు పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## శేష పాన్పు అవతారంలో జగన్నాథ స్వామి

**చోడవరం జులై 25 జయ జయహే**



చోడవరంలో జరుగుతున్న శ్రీ జగన్నాథ స్వామి వారి రథోత్సవ కార్యక్రమంలో భాగంగా దశావతారంలో చివరిదైనా శేష పాన్పు (రంగనాథ ) స్వామి వారి అలంకరణలో జగన్నాథుడు శనివారం దర్శనమిచ్చారు. అందున తొలి ఏకాదశి శనివారం కావడంతో రంగనాథ్ అవతారంలో గల స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తుల తరలివచ్చారు ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పది రోజులు పాటు ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందజేశారు. భక్తుల ఆదర అభిమానాలతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్టు ఆలయ అర్చకులు తెలిపారు.



## ఎల్లయ్య గ్రోయిన్ ప్రారంభించిన కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి నియోజకవర్గ రైతులకు ఇచ్చిన హామీ మేరకు శారదా నదిపై తుమ్మపాల గ్రామ సమీపంలో ఎల్లయ్య గ్రోయిన్ మరమ్మత్తు పనులు డి ఎం ఎఫ్ టి నిధులతో 1.19 కోట్ల వ్యయంతో పూర్తిచేసి శనివారం నదికి ప్రత్యేక పూజలుతో ప్రారంభ శరంభం పసుపు కుంకుమ పూలతో జరుపుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని ఆయన పేర్కొన్నారు డి ఎం ఎఫ్ టి ఇరిగేషన్ శాఖ ఎన్.ఆర్.ఇ.జి .ఎస్ నిధులతో సుమారు 10 కోట్ల వ్యయంతో డి లిస్టింగ్ కాలువలు అభివృద్ధి పనులు చేపట్టామని పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు చేరి ఉత్తరాంధ్రలో లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు అలాగే ఉత్తరాంధ్రలో పరిశ్రమల డేటా సెంటర్లో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలు స్థానంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రభుత్వ అధికారులు స్థానిక రైతులు పాల్గొనడం జరిగింది



## ఇందిరానగర్‌లో 108 మంది ముత్తైదువులు చీర సారె సమర్పణ.....

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు: తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలోని ఇందిరానగర్‌లో వెలసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 108 మంది ముత్తైదువులు అమ్మవారికి చీర సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి సమర్పించిన సారెను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, మహిళలు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాయిపేట, ఇందిరానగర్, బసివిరెడ్డిపేట ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ప్రశాంతంగా జరిగింది.



## డాక్యుమెంట్ రైటర్స్‌కు సంఘీభావం తెలిపిన మాజీ డిప్యూటీ సీఎం

**మాడుగుల జులై 25 జయ జయహే**

దస్తావేజులాకర్ల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా ప్రభుత్వ విడుదల చేసిన జీవో నెంబర్ 396 ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ డాక్యుమెంట్ రైటర్స్ చేపట్టిన పెన్డౌన్ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాడుగుల లో దీక్షలు చేపడుతున్న డాక్యుమెంట్ రైటర్స్ శిబిరానికి వెళ్లి వారిని పరామర్శించి మద్దతు తెలిపారు. రైటర్స్ న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్సీపీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల అనురాధ, ఎంపీపీ టీవీ రాజారాం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ రామధర్మజ, వైసిపి నాయకులు బి శ్రీనివాసరావు జే వరహాలు, తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా తొలి ఏకాదశి ఉత్సవాలు

**మాడుగుల జులై 25 జయ జయహే**

ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి పురస్కరించుకుని శనివారం మాడుగులలో గల శ్రీ జగన్నాథ స్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు మాడుగుల తో పాటు వివిధ గ్రామాల చెందిన వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అందున జనవరి స్వామి వారి రథోత్సవాలకు చివరి రోజు కావడంతో భక్తులు మరింత పోటెత్తారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం స్వామివారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనేక మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ స్వామివారి ఉత్సవ కమిటీ సేవకులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## వారాహి మాత ఆలయ నిర్మాణానికి లక్ష విరాళం

**మాడుగుల జులై 25 జయ జయహే**



మాడుగుల మండలం ఎం కోడూరు శ్రీ మోదకొండ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వారాహి మాత అమ్మవారి ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన మెల్లిపాక ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె భర్త కొండలరావు, కుమారుడు హితేష్, కుమార్తె యోగిత లు కలిసి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని శనివారం ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావుకు ఆలయం వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు శ్రీనివాస్ శర్మ దంపతులు, ఎంపిటిసి ముమ్మిన రవణ బాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు



## ఈనెల 30న మాడుగులలో మెగా జాబ్ మేళా

### గోడ పత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**మాడుగుల , జులై 25 జయ జయహే:**

ఈనెల 30న మాడుగుల డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా సుమారు 15 కంపెనీలతో నిర్వహించబోయే మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి ప్లేస్మెంట్ అధికారి బి వంశీ శనివారం తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు పదవ తరగతి, ఐ టి ఐ, డిప్లొమా, డిగ్రీ, పి జి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరముల వయస్సు గల యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలియజేసారు. కాబట్టి ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరములను నైపుణ్యం.ఏపీ. జివోవి. ఐ ఎన్ వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా ఎక్కువ రెస్యూమేలు, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్ లతో ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగు ప్రదేశానికి హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలు కు 7981102224 నంబర్లను సంప్రదించగలరు.

# 10 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించిన కలెక్టర్ విజయకృష్ణన్, కొణతాల రామకృష్ణ

**అనకాపల్లి జయ జయహే**



అనకాపల్లి నియోజక వర్గంలోని బగులవాడ గ్రామం పివి రమణ కాలనీ ఖనిజ సంపద అభివృద్ధి నిధి ద్వారా పది కోట్ల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లు డ్రైనేజీ పనులను శనివారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రారంభించారు అనకాపల్లి పట్టణంలోని క్రషర్ మెటీరియల్ రవాణా చేస్తున్న భారీ క్వారీ వాహనాలు కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడం పలువురు ప్రాణాలు కోల్పోవడం మరియు రహదారులు దెబ్బ తినడం విజయరామరాజుపేట వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి పలుమార్లు భారీ క్వారీ లారీలు ఢీకొనడంతో ప్రమాద పరిస్థితి ఏర్పడడం వంటి సమస్యలు దృష్టిలో ఉంచుకొని ప్రజల ప్రాణాల భద్రత కు ప్రాధాన్యత ఇస్తూ ఈ ప్రత్నామయ్య రహదారి నిర్మాణానికి కొణతాల రామకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు అనకాపల్లి చోడవరం రహదారి నుంచి మాకవరం జంక్షన్ వరకు పివి రమణ కాలనీ మీదుగా సిసి రహదారిని నిర్మించడం ద్వారా బగులవాడ మార్టూరు సిహెచ్ఎన్ అగ్రహారం తదితర మైనింగ్ ప్రాంతాల నుంచి వచ్చే భారీ క్వారీ లారీలను పట్టణంలో నుండి రాకుండా మళ్లించు అవకాశం కలిగింది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజలు భద్రతా తో పాటు ట్రాఫిక్ సమస్య లకు కూడా ఉపశమనం లభించనుంది పివి రమణ కాలనీ రోడ్లు డ్రైనేజీ నిర్మాణం పూర్తి కావడంతో స్థానికులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులో వచ్చాయని ఈ అభివృద్ధి పనుల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు ఆ గ్రామ ప్రజలు ఎమ్మెల్యే రామకృష్ణ ధన్యవాదాలు తెలుపుకుంటున్నారు అలాగే అక్కడ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం కూడా చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమంలోఏపియూఎఫ్ఐడిసి చైర్మన్ పీల గోవిందా సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ పంచాయతీరాజ్ శాఖ డి ఈ, ఏఈ సంబతిత శాఖల అధికారులు కూటమి నాయకులు ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచ వేదికపై ఫెర్టీ9 ప్రతిభ

**రాజమహేంద్రవరం, జయ జయహే :జూలై 25:**



ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు పొందింది. ప్రపంచ ప్రఖ్యాత ఈశ్రే --2026, టోక్యో అంతర్జాతీయ సదస్సు, ఆస్పిర్ కాన్ఫరెన్స్ ల్లో మొత్తం 19 పరిశోధనా పత్రాలు, ఒక ఓరల్ ప్రజెంటేషన్‌ను ఫెర్టీ9 వైద్య నిపుణులు సమర్పించి సంస్థ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై చాటారు.ఈ సందర్భంగా ఫెర్టీ9 రాజమహేంద్రవరం ఫెర్టిలిటీ సెంటర్ వైద్య నిపుణులు డా. అశ్విని వుయ్యూరి, డా. సౌమ్య వరుదుమాట్లాడుతూ,మారుతున్న జీవనశైలి,ఆలస్యవివాహాలు, ఉద్యోగ ఒత్తిడి, నైట్ షిఫ్టులు, పురుషుల్లో వీర్య నాణ్యత తగ్గడం వంటి అంశాలు సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. అయితే సరైన సమయంలో ఫెర్టిలిటీ నిపుణులను సంప్రదించి అవసరమైన పరీక్షలు, ఆధునిక చికిత్సలు ప్రారంభిస్తే తల్లిదండ్రులయ్యే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని వివరించారు.ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా ఫెర్టీ9 తన 11 కేంద్రాల్లో నీడిల్-ఫ్రీ ఐవిఫ్ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. రోజువారీ ఇంజెక్షన్ల వల్ల కలిగే నొప్పి, ఆందోళనను తగ్గించడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. అలాగే కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రజనన ఆరోగ్య పరిశోధనల ద్వారా ఐవిఫ్ విజయశాతాన్ని పెంచడంతో పాటు ఇంప్లాంటేషన్ వైఫల్యాలు, గర్భస్రావాల నివారణకు ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు దిశగా సంస్థ కృషి చేస్తోందని వెల్లడించారు.ఫెర్టీ9 తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 11 ఫెర్టిలిటీ కేంద్రాల ద్వారా అత్యాధునిక వైద్య సేవలు అందిస్తూ, పరిశోధన, నాణ్యమైన చికిత్సలు, రోగి-కేంద్రిత సేవలతో వేలాది మంది దంపతులకు తల్లిదండ్రులయ్యే ఆనందాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. డా. అశ్విని వుయ్యూరి, డా. సౌమ్య వరుదు, ఫెర్టీ9 క్లినికల్ బృందం, వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు



## నందమూరి బాలయ్య త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**బుచ్చినాయుడుకండ్రిగ, జులై 25,**

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుచ్చినాయుడు కండ్రిగ గ్రామంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ షూటింగ్ సమయంలో కాలికి గాయపడి శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని పూజలు నిర్వహించారు. టీడీపీ మాజీ మండల అధ్యక్షులు యం. సుధాకర్ నాయుడు, సముద్రాల శేఖర్ నాయుడు, నందమూరి అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించి బాలయ్య బాబుకు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని ప్రార్థించారు. ఆయన త్వరగా కోలుకుని ప్రజాసేవతో పాటు సినీ సేవను మరింత విజయవంతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. బాలయ్య బాబు పూర్తిగా కోలుకున్న అనంతరం కాలినడకన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటామని అభిమానులు తెలిపారు.



## రోడ్డు శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

### పీఎం జన్మాన్ నిధులతో 1.5 కి.మీ రోడ్డు మంజూరు..

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ జులై 26,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం నల్లగొండ పంచాయతీలో నల్లగొండ నుండి బొయ్యఉట్ట వరకు 1.5 కిలోమీటర్లలి రోడ్డును పీఎం జన్మాన్ నిధులతో మంజూరు చేయగా, ఆ రోడ్డుకు పాడేరు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో మారుమూల ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా రోడ్లు లేని గ్రామాలకు రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఆర్భాటం లేకుండా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం డబ్బులు జమ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అని తెలిపారు. ఇటువంటి మంచి ప్రభుత్వాన్ని కొనసాగించడానికి రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. కూటమి అధికారంలో ఉంటేనే మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, సీనియర్ నాయకురాలు బొర్రా విజయ రాణి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట వీర సత్యనారాయణ (దొరబాబు), కో-ఆపరేటివ్ చైర్మన్ సుమర్ల సాంబశివ, మండల ఉపాధ్యక్షురాలు గాం రమాదేవి, క్లస్టర్ ఇంచార్జ్ బోనంగి సత్యవతి, దీపూ కో-ఆపరేటివ్ డైరెక్టర్ రిమల చంద్రరావు, చింతపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గర్రెంగి రాజేశ్వరి, తోకల దేవి, వరలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షులు పల్లి అప్పారావు, కార్యదర్శి పొట్టిక సింహాచలం, బూత్ కన్వీనర్ పాంగి భీమరాజు తో పాటు గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న టీటీడీ ఈఓ ముద్దాడ రవిచంద్ర,

**శ్రీకాళహస్తి, జులై 25,జయ జయహే.**

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని టీటీడీ ఈఓ ముద్దాడ రవిచంద్ర శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.స్వామివారి దర్శనానంతరం ఆలయ విశేషాలు, భక్తులకు అందుతున్న సేవలు, ఆలయ నిర్వహణ తదితర అంశాలపై దేవస్థానం అధికారులతో ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో దేవస్థానం ఈఓ బి.కె. వెంకటేశులు, ఆలయ చైర్మన్ సాయిప్రసాద్, బోర్డు సభ్యులు గురప్ప శెట్టి, మురళి, కుసుమ కుమారి, నాగరాజు, ప్రోటోకాల్ ఏఈఓ పి. లోకేష్ బాబు, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు సి నాగభూషణం యాదవ్ , ఏపీఆర్ఓ రవి తదితరులు పాల్గొన్నారు.




## వేడుకగా బృహన్నల పుర విహారం

**శ్రీకాళహస్తి, జులై 25,జయ జయహే.**


శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధాలయమైన శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి వారి బ్రహ్మోత్సవాలు తొమ్మిదవ రోజు వేడుకగా నిర్వహించారు. శనివారం ఉదయం బృహన్నల అలంకారమూర్తిని పురవిహారం నిర్వహించారు. కార్యక్రమం లో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పేట శాంతి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన తలపా దామోదరం రెడ్డి

**శ్రీకాళహస్తి, జులై 25,జయ జయహే.**

పాత్రికేయులు పేట శేఖర్ మాతృమూర్తి పేట శాంతి పార్టీవ దేహానికి శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, నాగరాజు,నిజాముద్దీన్, మహేష్, అరుణ్, చరణ్, మాస్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల కోసం కాంగ్రెస్ దీక్ష.. కేంద్రంపై ఫైర్

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 25**

ఢిల్లీలో విద్యార్థుల పోరాటానికి మద్దతుగా ఎఐసిసి పిలుపు, పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం గోకవరం బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద ఒకరోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు అమర్ జహా బేగం, కాంగ్రెస్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ టికె విశ్వేశ్వరరెడ్డి, నిడదవోలు కోఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అల్లు బాబీ మాట్లాడారు. ఎన్‌టీఏ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నదని ఆరోపించారు. విద్యార్థులకు మద్దతుగా ఆందోళన చేపట్టిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఎన్‌టిఎను రద్దు చేసే వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పరీక్షల ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్న 22 మంది విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అల్లు బాబీ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమానికి తన మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మోతా శారత్, తాడి సూరిబాబు, తాడాల కొండరాజు, యేసు, సాకా పుల్లారావు, డాక్టర్ యాళ్ల వీరభద్రరావు, శ్రీనివాస్ వడియార్, సింధియారాణి, ఆలీ, కిశోర్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## చీడిపాలెం గ్రామపంచాయతీలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం..

### ఎం.పి.డి.ఓ జిడివి ప్రసాద్..

**కొయ్యురు :(జయ జయహే )న్యూస్ జులై 26,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం చీడిపాలెం గ్రామపంచాయతీలో సోమవారం తేదీ 27.07.2026 న గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎం.పి.డి.ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల సమస్యలను అధికారులు నేరుగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని అన్నారు. ఈ గ్రీవెన్స్ కు మండల స్థాయి అధికారులు హాజరవుతారని, చీడిపాలెం మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ సమస్యలతో హాజరుకావాలని ఎం.పి.డి.ఓ కోరారు.





## రిజిస్ట్రేషన్ సేవలు యథావిధిగా జరుగుతున్నాయి

### ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దు: సబ్-రిజిస్ట్రార్ కృష్ణంరాజు

**తణుకు, జూలై 25: (జయ జయహే)**



రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభంగా, పారదర్శకంగా అందించేందుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో తణుకు సజ్జాపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అన్ని రిజిస్ట్రేషన్ సేవలు యథావిధిగా కొనసాగుతున్నాయని తణుకు సజ్జాపురం సబ్-రిజిస్ట్రార్ కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వర్గాలు చేపట్టిన నిరసనల నేపథ్యంలో ప్రజల్లో అనవసర అపోహలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, తణుకు, సజ్జాపురం కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలకు ఎలాంటి అంతరాయం లేదని స్పష్టం చేశారు. దస్తావేజుల నమోదు, పరిశీలన, ఎంకంబరెన్స్ సర్టిఫికెట్లు, ధ్రువీకరణ పత్రాలు తదితర అన్ని సేవలను యథావిధిగా అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు "మే ఐ హెల్ప్ యూ" డెస్క్ ద్వారా అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం అందిస్తూ సేవలను వేగవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అన్ని ప్రక్రియలను అధికారులు, సిబ్బంది సమన్వయంతో సజావుగా పూర్తి చేస్తున్నారని వివరించారు.



## అగ్నిగుండ ప్రవేశం ఏర్పాట్లను పరిశీలించిన ఆలయ చైర్మన్ సాయిప్రసాద్, ఈఓ బి.కె.వెంకటేశులు

**శ్రీకాళహస్తి, జులై 25,జయ జయహే.**

శ్రీ ద్రౌపతీ సమేత ధర్మరాజు స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం జరగనున్న అగ్నిగుండ ప్రవేశం ఏర్పాట్లను ఆలయ చైర్మన్ కె.సాయిప్రసాద్, ఈఓ బి.కె.వెంకటేశులు శనివారం పరిశీలించారు. సుబ్బందికి సూచనలు చేశారు.

# ఉత్తమ ఆంధ్రగా ఉత్తరాంధ్ర...!

### ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానించే ప్రధాన రహదారుల అభివృద్ధి

### విమానాశ్రయంతో మారనున్న ఉత్తరాంధ్ర ఆర్థిక ముఖచిత్రం

### వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్

**విశాఖపట్నం, జులై 25, జయ జయ హే**



కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఉత్తరాంధ్రను ఉత్తమ ఆంధ్రగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటి మంత్రి నారా లోకేష్ కృషిచేస్తున్నారని విఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ అన్నారు. శనివారం ఉదయం వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజభరత్, సి.ఈ. వినయ్ కుమార్ లతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న దేశ ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఐటీ శాఖమంత్రి నారా లోకేష్ తదితరుల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం కానుందన్నారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రావటంతో ఉత్తరాంధ్ర వాసుల కల నెరవేరబోతుందన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్థికముఖచిత్రం మార్చేస్తుందని , ఈ విమానాశ్రయం పెట్టుబడులను ఆకర్షించేందన్నారు. ఒక విధంగా చెప్పాలంటే భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజన్ గా, పర్యాటకంతో పాటు పలు రంగాల ప్రగతి సాధనకు గేమ్ చేంజర్గా మారనుందన్నారు. భోగాపురం విమానాశ్రయం రావటంతో ఎన్నో కొత్త పరిశ్రమలు, ఐటీ కంపెనీలు ఉత్తరాంధ్రకు తరలిరానున్నాయని, స్థానిక యువతకు విమానాయానం, కార్గో, పర్యాటకం, ఆతిథ్యరంగం వంటి రంగాల్లో పెద్ద ఎత్తున ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఉపాధి లభించనుందన్నారు. ఉత్తరాంధ్రకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి ఉత్తరాంధ్ర యువత తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

**రహదారుల అభివృద్ధిలో వీఎంఆర్డీఏ కీలక పాత్ర**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంకు నగరవాసులు రాకపోకలు సాగించేందుకు వీలుగా పలు ప్రధాన రహదారులను విస్తరణ చేపట్టటంలో వీఎంఆర్డీఏ కీలకపాత్ర పోషించిందన్నారు . భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకునేందుకు వీలుగా జాతీయ రహదారికి అనుసంధానించేలా 15 ప్రధాన రహదారుల విస్తరణ చేపట్టాల్సి ఉందని, అయితే ముందుగా అత్యంత ప్రాదాన్యత కలిగిన 7 రహదారులను వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బి శాఖల ద్వారా అభివృద్ధిచేయటం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రూ.170 కోట్లతో వి ఎం ఆర్ డి ఎ ద్వారా రహదారుల అభివృద్ధి పనులు చేపట్టామని, వీఎంఆర్డీఏ ద్వారా 26 కి.మి. మేర రహదారులను విస్తరించటం జరిగిందన్నారు. వీటిలో కేవలం 4కి.మి. మినహా మిగిలిన రహదారులు అభివృద్ధి పనులు పూర్తయ్యాయన్నారు.

**మార్గ సూచికలు ఏర్పాటుకు సన్నాహాలు**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అనుసంధానించే ప్రధాన రహదారులను కేవలం 9 నెలల సమయంలోనే పూర్తి చేయటం జరిగిందని, ఇందుకు ఇంజనీరింగ్ అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు . యుద్ధ సమయంలో తారు కొరత వచ్చినా, చెన్నై నుంచి దిగుమతి చేసుకుని మరీ రోడ్డు పనులు చేపట్టి అనుకున్న సమయానికి పూర్తి చేశామని పేర్కొన్నారు . విమాన ప్రయాణికులు విమానాశ్రయానికి సులభతరంగా చేసుకునేలా ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు కలిసే కూడళ్ల వద్ద మార్గ సూచికలను సైతం ఏర్పాటుచేయనున్నామన్నారు. కూడళ్ల వద్ద ప్రమాదాలను నివారించేందుకు ఆయా ప్రాంతాలను విస్తరణ చేస్తున్నామన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రావటం ద్వారా ఉత్తరాంధ్రకు మహోర్దశ పడుతుందన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానించే ప్రధాన రహదారులు ప్రజల సహకారంతో త్వరితగతిన పూర్తి చేశామన్నారు. అదేవిధంగా బీచ్ రోడ్ ద్వారా భోగాపురం విమానాశ్రయానికి చేరుకునేలా కోస్టల్ కారిడార్ ను కూడా అభివృద్ధి చేయనున్నామని, తెన్నేటిపార్కు నుంచి భీమిలి వరకు, భీమిలి నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు బీచ్ రోడ్డు వెంబడి రహదారిని జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ అభివృద్ధి చేయనుందన్నారు. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి నగరవాసులు, విమాన ప్రయాణికులు సులభతరంగా చేరుకునేలా, అభివృద్ధిచేసిన రహదారుల మీదుగా వెళ్లటానికి వీలుగా గుగుల్ మ్యాప్లు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అభిమానులకు "చిరు" బీమా ప్రశంసనీయం: గంటా

**విశాఖపట్నం, జులై 25: (జయ జయహే)**

అభిమానులకు రూ. 5 లక్షల బీమా సౌకర్యం అందించాలన్న మెగాస్టార్ చిరంజీవి నిర్ణయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రశంసించారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ ఆఫీస్ లో చిరంజీవి అభిమాన సంఘం ప్రతినిధులు శనివారం గంటా ను కలిశారు. ఆగస్టు 22 వ తేదీన మెగాస్టార్ పుట్టినరోజు సందర్భంగా చేపట్టబోయే సామాజిక సేవా, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. చిరంజీవితో తనకెంతో సాన్నిహిత్యం ఉందని.. అభిమానులకు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. ఇప్పటికే బ్లడ్ బ్యాంక్ ద్వారా సేవ చేస్తున్న చిరంజీవి మరో అడుగు ముందుకేసి బీమా కోసం అభిమానుల జాబితా రూపొందించడం ఆదర్శనీయమైన నిర్ణయంగా పేర్కొన్నారు. అభిమానులను కుటుంబ సభ్యులుగా భావించే చిరంజీవి పుట్టిన రోజు నాడు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈనెల 30 వ తేదీ సాయంత్రం పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియం లో క్యాలు ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో జరగనున్న సినీ నేపథ్య గాయని ఎస్.జానకి సంగీత విభావరి పోస్టర్ ను గంటా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గల్లా కొండలరావు, కోయిలాడ శ్రీనివాస్, వాసుపల్లి ఎల్లాజీ, మధు, లంక శ్రీను, పి.వెంకటరమణ, జనార్ధన్, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 2 జాతీయ జెండా ర్యాలీ

### గోడ పత్రిక ఆవిష్కరించిన మంత్రి పార్థసారధి

**జంగారెడ్డిగూడెం -జయ జయహే**

ఆగస్టు 2 వ తేదీ జంగారెడ్డిగూడెం పట్టణంలో నిర్వహించబోతున్న రెండు కిలోమీటర్ల భారీ జాతీయ పతాక ప్రదర్శన ర్యాలీని విజయవంతం చేయ్యాలని రాష్ట్ర గృహ నిర్మాణ పౌర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారని తెదేపా రాష్ట్ర అధికారప్రతి నిధి దాసరి శేషు మీడియా కు తెలిపారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 150వ జన్మదినం సందర్భంగా జాతీయ జెండా ర్యాలీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.. ఈసందర్భంగా నిర్వాహకులు సచివాలయంలోని ఆయన చాంబర్ వద్ద ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మంత్రిచే ఆవిష్కరించారని శేషు వివరించారు.. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ జిల్లాలోని అతిపెద్ద జాతీయ జెండా ప్రదర్శనగా ఈ యొక్క కార్యక్రమం ఉండబోతుందని ఇలాంటి కార్యక్రమానికి విద్యార్థులు మేధావులు పౌరులు ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారన్నారు.ఇది ఒక జంగారెడ్డిగూడెం ప్రాంతానికే కాక ఏలూరు జిల్లాకే మంచి కార్యక్రమంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శేషు మాట్లాడుతూ ఆగస్టు రెండో తేదీన ఉదయం 8 గంటలకు జంగారెడ్డిగూడెం బస్టాండ్ నుంచి అశ్వా రావుపేట రోడ్డులోని బాయ్స్ హై స్కూల్ వరకు భారీ జాతీయ జెండా ప్రదర్శన ర్యాలీ నిర్వహించబోతున్నామనిచెప్పారు.దానికి ముందు 29 జూలై ఉదయం 6 గంటలకు పింగళి వెంకయ్య సేవలను స్మరిస్తూ ఒక మారథాన్ కూడా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొలుసు పార్థసారధిని ముఖ్యఅతిథిగా విచ్చేయాలని కూటమి నాయకులందరు కలిసి వెళ్లి ఆహ్వానం పలికారు.

## నేడు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం

**విశాఖపట్నం, జూలై 25, జయ జయహే**



రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేకమైన ఉచిత వైద్య శిబిరాన్ని ఈనెల 26వ తేదీ ఆదివారం నాడు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్ కృష్ణకుమారి తెలిపారు. శంకరమఠం రోడ్ లో వి హెల్త్ కేర్ లో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. మహిళలకు, ఆడపిల్లలకు వివిధ ఆరోగ్య పరీక్షలను ఉచితంగా చేసి తగు వైద్య సలహాలను అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ రొటేరియన్ డాక్టర్ సుందరి, ప్రముఖ చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ వి వసుధ ఆయా విభాగాలలో వైద్య సేవలను అందజేస్తున్నారు. ఈ శిబిరంలో 40 సంవత్సరాల వయసు దాటిన మహిళలకు బిపి, షుగర్, ఈసీజీ పరీక్షలను కూడా ఉచితంగా చేస్తారని ఆమె తెలిపారు. మహిళలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ కమ్యూనిటీ సర్వీసెస్ (మెడికల్) డాక్టర్ అశోక్ దేవరకొండ విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల భవితకు బలమైన పునాది తల్లికి వందనం...!

### టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి గంటా నూకరాజు

**విశాఖపట్నం, జూలై 25, జయ జయహే**



విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం బలమైన పునాదిగా నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు శనివారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, విద్యార్థుల ఉన్నతమైన జీవితానికి విద్యే మూలకారణమని అన్నారు. పేద తల్లిదండ్రులు కూడా తన పిల్లలను ఆర్థిక పరమైన కారణాలుతో బడికి దూరంగా ఉంచరాదనే సంకల్పంతో తల్లికివందనం పథకంను కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని అన్నారు. గత ప్రభుత్వం ఒక ఇంటిలో ఒకరికి మాత్రమే డబ్బులు ఇచ్చేవని అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి 13 వేల రూపాయలు తల్లి ఖాతాలో జమ అయ్యాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనే పిల్లలకు మన్నికగల యూనిఫారం, స్కూల్ బ్యాగ్స్, పుస్తకాలు మరియు షూ కూడా ఇవ్వడం అయిందని అన్నారు. కేవలం తల్లికివందనం పథకం ద్వారా రూ. 10 వేల కోట్లు ఏడాదికి ఖర్చు చేస్తుందని అన్నారు. అదేవిదంగా ప్రతీ ఏడాది జూలై నెలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్స్ ఏర్పాటు చేయడం ద్వారా తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల మధ్య ఎటువంటి తారతమ్యాలు లేకుండా చేయడం జరుగుతుందని అన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలలో గతంలో కంటే 15 శాతం విద్యార్థులు అదనంగా పెరిగారని, మరికొన్ని పాఠశాలలో అయితే నో వేకెన్సీ బోర్డులు కూడా ఉంటున్నాయంటే కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతలా కృషి చేస్తుందో అర్థం అవుతుందని గంటా నూకరాజు అన్నారు.



## ఎస్ఐఆర్పై సమీక్ష నిర్వహించిన చొక్కాకుల

**సబ్బవరం జయ జయహే**

సబ్బవరం మండలం, రావులమ్మపాలెం లో బిజెపి పార్టీ పెందుర్తి నియోజకవర్గం బి ఎల్ ఏ -2 చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలో పెందుర్తి నియోజకవర్గం బిజెపి పార్టీ ముఖ్య నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు మరియు టోలీ మెంబెర్స్ లో సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గం లో ఉన్న బి ఎల్ ఏ -2 లతో సమావేశం సబ్బవరం బి ఎస్ ఎన్ డెస్టిని కన్వెన్షన్ లో ఏర్పాటు చేయుటకొరకు మరియు బిఎల్ ఏ -2 అందరూ పాల్గొనేటట్లు మండలపార్టీ అధ్యక్షులు పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముమ్మన దేముడు, అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ ఉపాధ్యక్షులు పట్టాభి ప్రసాద్, ప్రధానకార్యదర్శి గొర్లె రామునాయుడు, బిజెపి పార్టీ కిసాన్ మోర్చా అధ్యక్షులు సరగడం శంకరరావు, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు గౌటివాడ సామ్రాట్ కుమార్, సబ్బవరం మండలం పార్టీ అధ్యక్షుడు గొంప నర్సింగరావు, పెందుర్తి మండల పార్టీ అధ్యక్షుడు ముదపాక శివ, చినముషిడివాడ మండలం అధ్యక్షులు చిక్కాల సతీష్, వేపగుంట మండల పార్టీ అధ్యక్షులు నేపర్తి వెంకటరమణ, పరవాడ మండల పార్టీ అధ్యక్షులు పిల్లా సతీష్, టాలీలు కామిరెడ్డి దేముడు, ఐ.అచ్చం నాయుడు, బంతికోరు గోవింద రాజు, మండల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యామ్నాయ రాజకీయం అవసరం: డా పి.వి. రమేష్

**గుంటూరు (జయ జయహే)**



ఆంధ్రప్రదేశ్ లో రాజకీయాలు వ్యాపారమయంగా మారినాయని, అవినీతి తారస్థాయికి చేరిందని, అప్పులు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 80 శాతానికి చేరాయని, ప్రజలను ప్రాంతాలు, కులాలు, మతాలు ప్రాతిపదికన చీల్చి పాలన చేస్తున్నారని ఈ పరిస్థితులను అధిగమించడానికి ఆంధ్రప్రదేశ్ లో ప్రత్యామ్నాయ రాజకీయం తక్షణ అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా ॥ పి.వి. రమేష్ పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో రాష్ట్ర రాజకీయాలలో ప్రత్యామ్నాయం అవసరమా? అనే అంశంపై జరిగిన చర్చా గోష్టిలో ప్రధాన వక్తగా డా॥ పి.వి. రమేష్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఉన్న 123 పట్టణాలలో ఏ ఒక్క పట్టణంలోనూ రక్షిత మంచినీరు అందించడం లేదని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేదని తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన దినపత్రికలు ఆయా రాజకీయ పార్టీల కరపత్రాలుగా మారినాయని, సోషల్ మీడియాను శత్రు శిబిరాలుగా మారుస్తున్నారని వివరించారు. కొందరు ఐఏయస్, ఐపీఎస్ అధికారులు సైతం రాజకీయ రంగు పూసుకుని వ్యవహరిస్తున్నారని అన్నారు. రాజకీయాలను కార్పొరేటీకరణ చేస్తున్నారని అదాని, అంబానీ, ఇండోసోల్ మెగా లాంటి సంస్థలకు రెడ్ కార్పెట్ పరుస్తూ సహజ వనరులను వారికి ధారాదత్తం చేస్తున్నారని వివరించారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చేస్తున్న చట్టాలన్నిటికీ ఆంధ్రప్రదేశ్ లోని టిడిపి, జనసేన, వైకాపా పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాయని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ మార్పును ఆశించే ఉన్నతమైన వ్యక్తుల బృందాన్ని ఏర్పాటు చేసి పౌర సమాజాన్ని సంఘటిత పరిచే కృషి చేస్తున్నామని వివరించారు. రాజధాని పేరుతో వేలాది కోట్ల రూపాయలను అస్మతీయులకు దోచిపెడుతున్నారని, విద్యా సంస్కరణలపై కాక్రోచ్ జనతా పార్టీ జంతర్ మంతర్ వద్ద చేస్తున్న వీరోచిత పోరాటానికి తెలుగుదేశం, జనసేన, వైకాపా పార్టీలు మద్దతు ఇవ్వలేని దీనస్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు. శాసనమండలి మాజీ సభ్యులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ లో రైతులు పండించే ఏ పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. వివిధ సమస్యలపై అఖిలపక్ష సమావేశాలు నిర్వహించడం లేదని అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు శత్రువులుగా వ్యవహరిస్తున్నాయన్నారు. తమిళనాడులో విజయ్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడటం, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద వేలాది మంది యువత గత నెల రోజులుగా ఉద్యమించడం కాక్రోచ్ జనతా పార్టీకి 2.4 కోట్ల మంది అతి తక్కువ కాలంలోనే ఫాలోవర్స్ గా మారటం మార్పుకు సంకేతికంగా మారిందన్నారు . ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం, మేలుకో ఆంధ్రప్రదేశ్ కో ఆర్డినేటర్ రమేష్ పట్నాయక్, రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షులు నడింపల్లి గురుదత్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు చంద్రా నాయక్, ప్రముఖ ప్రజా గాయకులు గని తదితరులు పాల్గొని ప్రసంగించారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com